www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 28-1-2024

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

'పొగాకు' కోసం భగీరథయత్నం

కందుకూరు : పొగతోటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథయత్నం చేస్తున్నారు. వాతావరణం అనుకూలించక గిడసబారుతున్న పొగతోటల పెరుగుదల కోసం రూ.లక్షలు వ్యయం చేస్తుండటమే గాక రేయింబవళ్లు పొలాల్లోనే జాగారం చేస్తున్నారు. ఓ వైపు దట్టంగా కురుస్తున్న మంచు, మరో వైపు చిమ్మచీకట్లో విషపురుగుల భయాన్ని కూడా పక్కనపెట్టి పొగతోటలకు తడి అందించేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. కుంటల్లో చెరువుల్లో, వాగుల్లో వంకల్లో ఎక్కడ నీటిజాడ కనిపించినా ఈ నీటిని తమ పొగతోటలకు తరలించి తడి ఇవ్వటానికి సిద్ధపడుతున్నారు. రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నీటిని తాత్కాలిక పైపులైన్ల ద్వారా తరలించటానికి సిద్ధపడుతున్నారు. దీనికితోడు అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటికోసం పోటీలు పడుతున్న పరిస్థితి కావటంతో రేయింబవళ్లు నీరు కడుతున్నారు.



ఆయిల్ ఇంజన్‌తో పొలాలకు నీటి తరలింపు



షర్మిలకు స్వాగతం పలికేందుకు తరలివచ్చిన కాంగ్రెస్ కేడర్



శ్రేణులకు అభివాదం చేస్తున్న పీసీసీ చీఫ్ షర్మిల

'కృష్ణపట్నం'పై సమాధానం చెప్పండి!

- ప్రభుత్వం, మంత్రి జవాబు ఇవ్వాలి
- ఫ్లెక్సీలు తొలగిస్తే భయపడతామా!?
- వైసీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైంది!
- ప్రభుత్వంపై విరుచుకుపడ్డ షర్మిల
- ఒక్కో కార్యకర్త సైనికుడిగా మారాలని పిలుపు
- నెల్లూరుకు తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

పోర్టులో కంటైనర్ కార్గో తరలిస్తే రాష్ట్రంపై తీవ్ర ప్రభావం

నెల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : 'గంగవరం పోర్టును వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంచి ఉద్దేశంతో నిర్మించారు. 30 సంవత్సరాల్లో ఆ పోర్టు పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలోకి వస్తుందని ఆశించారు. కానీ 15 ఏళ్లు గడిచాక వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.70 వేల కోట్ల విలువ చేసే పోర్టును కేవలం రూ.600 కోట్లకు అదానీకి అప్పజెప్పారు. ఇప్పుడు కృష్ణపట్నం పోర్టును కూడా అదే తరహాలో అదానీకి కట్టబెట్టారు. ఈ పోర్టు నుంచి కంటైనర్ కార్గోను అదానీ యాజమాన్యం తరలిస్తోంది. ఇది జరిగితే 10 వేల కుటుంబాలు ప్రత్యక్ష ఉపాధి కోల్పోయి రోడ్డున పడడంతోపాటు రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇదెక్కడి న్యాయం? దీనిపై మాట్లాడేందుకు బాధితులు వెళితే మంత్రి కనీసం పలకడం లేదట. అదానీ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది? దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలి' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాక జిల్లాల పర్యటనలు చేస్తున్న ఆమె శనివారం నెల్లూరుకు చేరుకున్నారు. ఒంగోలు నుంచి రోడ్డు మార్గాన సాయంత్రం 4 గంటల సమయంలో కోవూరుకు చేరుకున్న షర్మిలకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైకులు, కార్లతో భారీ ర్యాలీగా ఇందిరా భవన్‌కు చేరుకున్నారు. అనంతర షర్మిల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడి రాష్ట్ర ప్రభుత్వ పనితీరును షర్మిల ఎండగట్టారు.



● ఇందిరా భవన్‌కు కళ

దశాబ్ద కాలం క్రితం వరకు పెద్ద నాయకులు, కార్యకర్తలతో సందడిగా కనిపించిన ఇందిరా భవన్ (కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం) రాష్ట్ర విభజన తర్వాత బోసిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దయనీయంగా మారడంతో ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లోకి వలస వెళ్లిపోయారు. దీంతో ఇందిరాభవన్ వార్తల్లో లేకుండా పోయింది. అయితే శనివారం ఒక్కసారిగా కళకళలాడిపోయింది. నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఇందిరా భవన్‌కు చేరుకున్నారు. షర్మిల మాట్లాడుతున్నప్పుడు శ్రేణులు ఉత్సాహంగా కనిపించాయి. చివరగా షర్మిలను సన్మానించేందుకు నాయకులు, కార్యకర్తలు పోటీపడ్డారు.

● నేను సిద్ధం.. మీరు సిద్ధమా!?

'నేను నెల్లూరుకు వస్తున్నానని మా ఫ్లెక్సీలను తొలగించారు. కలెక్టర్ సహా మమ్మల్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వైసీపీకి భయం పట్టుకుంది. సోషల్ మీడియాలో నన్ను తిట్టిపోస్తున్నారు. అంటే వైసీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైంది. ఎవరికీ భయపడేది లేదు. పేదలకు న్యాయం చేసేందుకు ఎంత వరకైనా పోరాడుతాం. నేను సిద్ధం.. మీరు సిద్ధమా..' అంటూ కార్యకర్తల్లో షర్మిల జోష్ నింపే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్‌తోనే ప్రజలకు, రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని చెప్పారు. ఒక్కో కార్యకర్త ఒక్కో సైన్యంగా మారి రానున్న 70 రోజులు కష్టపడాలని పిలుపునిచ్చారు. నేడు రాష్ట్రంలో వ్యవసాయం దండగగా మారిందని వ్యాఖ్యానించారు. చాలా చోట్ల పంటలు వేయడం లేదని, కనీసం ప్రాజెక్టుల నిర్వహణ కూడా చేయడం లేదని షర్మిల దుయ్యబట్టారు. మరి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎవరిని ఉద్ధరించారని ప్రశ్నించారు. అంతకముందు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబర్ కే రాజు మాట్లాడుతూ ఉద్యమాలకు పురిటిగడ్డ నెల్లూరు అని పేర్కొన్నారు. తాను నాలుగేళ్లపాటు నెల్లూరుకు కలెక్టర్‌గా పని చేశానని, ఆనాడు అక్షర చైతన్యం, సారా ఉద్యమాలు దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయని గుర్తు చేశారు. ఆ వీర మహిళల ఉద్యమ స్ఫూర్తితో జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తాము పార్టీ మారలేదని గుర్తు చేశారు. రెట్టించిన ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరం పని చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో షర్మిలతోపాటు సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రులు జేడీ శీలం, పల్లంరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ, మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




నెల్లూరు నగర శివార్లలో షర్మిలకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు

అక్రమ అరెస్టుల తరువాత తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడానికి, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రజలను చైతన్యపరచడానికి ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సింహపురి గడ్డ నుంచి ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. నగరంలోని శ్రీ వేణుగోపాల స్వామి ప్రభుత్వ కళాశాల మైదానంలో ఉదయం 10 గంటలకు 'రా.. కదలి రా!' పేరిట జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయడానికి జిల్లా నాయకత్వం సర్వశక్తులూ ఒడ్డుతోంది. చంద్రబాబు సభతో కార్యకర్తలను ఎన్నికల సమరోన్ముఖులను చేసే దిశగా సాగనుంది.

రా.. కదలిరా!

సమరశంఖం పూరిద్దాం!

- టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా చంద్రబాబు పర్యటన
- విపత్కర పరిస్థితుల అనంతరం ఎన్నికలకు సన్నద్ధం
- నెల్లూరులో నేడు బహిరంగ సభ
- భారీ ఏర్పాట్లు చేసిన జిల్లా నాయకత్వం



నెల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తొలి నుంచి టీడీపీ పోరాడుతూనే ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ వేధింపులు, అక్రమ కేసులను ఎదుర్కొని ధీటుగా నిలబడింది. నిరంతర పోరాటాల క్రమంలో నాలుగేళ్ల తరువాత టీడీపీ బలం పుంజుకోవడం ప్రారంభించింది. సీఎం, వైసీపీ అధినేత జగన్ వైఖరితో పొగసలేని ఆ పార్టీకి చెందిన ముగ్గురు బలమైన ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తిరుగుబాటు ప్రకటించారు. అప్పటి నుంచి జిల్లాలో వైసీపీ బలహీనపడటం, టీడీపీ బలపడటం మొదలయ్యింది. ఈ ముగ్గురి తిరుగుబాటుతో వైసీపీ నాయకుల్లో ఆ పార్టీ అధినాయకత్వం పట్ల ఉన్న వ్యతిరేకత వ్యక్తం కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో ప్రజల్లో, ముఖ్యంగా యువతలో వైసీపీ పట్ల ఉన్న వ్యతిరేకత స్పష్టమయ్యింది. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడగలిగే శక్తి టీడీపీకి మాత్రమే ఉందనే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా ప్రజలు స్పష్టం చేశారు. అప్పటి నుంచి శరవేగంగా ఊపందుకున్న తెలుగుదేశం పార్టీ నారా లోకేష్ యువగళం పాదయాత్రతో మరింత ఊపు పెంచుకుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో లోకేష్ పాదయాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహపడ్డాయి. ఒక్కమాటలో చెప్పాలంటే యువగళం పాదయాత్రతోనే జిల్లాలో ఎన్నికల వాతావరణం వచ్చేసింది. అయితే ఊహించని విధంగా జరిగిన చంద్రబాబు అక్రమ అరెస్టు జిల్లా టీడీపీ శ్రేణుల ఉత్సాహంపై నీళ్లు చల్లింది. అప్పటి వరకు ఎన్నికల మూడ్‌లో ఉన్న టీడీపీ శ్రేణులు ఆత్మరక్షణ స్థితికి చేరుకున్నారు. చంద్రబాబు విడుదల కోసం దీక్షలు కొనసాగిస్తూనే, మరోవైపు పార్టీ భవిష్యత్తు పట్ల ఆందోళన చెందుతూ వచ్చారు. చంద్రబాబు విడుదలతో ఊపిరి పీల్చుకున్నారు కానీ యువగళం నాటి ఉత్సాహాన్ని తిరిగి తెచ్చుకోలేక పోయారు. పార్టీ శ్రేణులు కోల్పోయిన ధైర్యాన్ని తిరిగి నింపడానికి, రాష్ట్ర భవిష్యత్తు పట్ల ప్రజల్లో భరోసా నింపడానికి అటు కార్యకర్త లను, ఇటు ప్రజలను ఎన్నికల వైపు సమరోన్ముఖులను చేయడానికి రా...కదలిరా..! అనే నినాదంతో చంద్రబాబు పర్యటనలు మొదలు పెట్టారు. అందులో భాగంగా ఆదివారం సింహపురి గడ్డపై నుంచి చంద్రబాబు ఎన్నికల సమర శంఖం పూరించ నున్నారు. అక్రమ అరెస్టు తరువాత తొలిసారిగా జిల్లాకు వస్తున్న అధినేతకు భారీ స్థాయిలో స్వాగతం పలకడానికి, కనీవినీ ఎరుగని రీతిలో సభను విజయవంతం చేయడానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేశారు.



ఎస్వీజీఎస్ మైదానంలో రూపుదిద్దుకున్న సభా వేదిక

● సభకు విస్తృత ఏర్పాట్లు

ఎస్వీజీఎస్ మైదానంలో చంద్రబాబు సభ కోసం టీడీపీ జిల్లా నాయకత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి హెలికాప్టర్‌లో కనుపర్తి పాడు జడ్పీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు ఉదయం 11.30 గంటలకు చంద్ర బాబు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన సభా వేదికకు వస్తారు. మధ్యా హ్నం 1 గంట వరకు ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగి స్తారు. భోజన విరామం అనం తరం జిల్లా నాయకులతో మాట్లా డి కర్నూలు జిల్లా పత్తికొండకు హెలికాప్టర్‌లో వెళతారు. కాగా, సభా వేదికను సిద్ధం చేయడంతో పాటు తరలివచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతలు శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలోని ప్రతి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో శ్రేణులు, అభిమానులు, ప్రజలు బహిరంగ సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

- చేజర్లలో యథేచ్ఛగా తెల్లరాయి అక్రమ రవాణా
- ప్రభుత్వ, ప్రైవేటుతోపాటు ఆలయ, అటవీ భూములనూ వదలని వైనం
- తెర వెనుక అధికార పార్టీ నేతల అండ
- నెల మామూళ్లతో పట్టించుకోని యంత్రాంగం

అడిగేది ఎవరు..

అడ్డుకునేది ఎవరు!?

'మమ్మల్ని అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు!?' అన్నరీతిలో చేజర్ల మండలంలో అధికార పార్టీ నాయకులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములతో పాటు ఆలయం, అటవీ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వి అక్రమ మైనింగ్ చేస్తూ ప్రకృతి సంపదను దోచేస్తు న్నారు. అక్రమార్కులకు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, అధికారుల అండదండలు ఉండ టంతో వారి ఆగడాలు శ్రుతి మించుతున్నాయి.



కోటితీర్థం గ్రామంలోని కోటీశ్వరాలయ భూముల్లో తెల్లరాయిని వెలికి తీస్తున్న ఎక్స్‌కవేటర్

చేజర్ల, జనవరి 27 : మండలంలోని కోటితీర్థం, టీకేపాడు, కొలవ నాయుడుపల్లి, చిత్తలూ రు వావిలేరు, మడపల్లి, కాకివాయి, పాడేరు, చేజర్ల ఆదురుపల్లి, పాతపాడు, ఓబు లాయపల్లి తదితర గ్రామాలలో తెల్లరాయి నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. పట్టా భూముల్లో ఉన్న క్వార్ట్జ్‌ను అమాయక రైతులకు ఎంతోకొంత నగదు ఇచ్చి తవ్వకాలు జరుపుతు న్నారు. ఇక ప్రభుత్వ భూ ముల్లో మైనింగ్ మాఫియా ఇష్టారాజ్య మైంది. ప్రజా ప్రతినిధుల అండతో అధికారులకు మామూళ్లు అందజేసి తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వ ప్రైవేటు భూములలో మాత్రమే జరిగే మాఫియా కార్యకలాపాలు ప్రస్తుతం ఆలయ, అటవీ భూములను కూడా వదిలి పెట్టడంలేదు. జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోటితీర్థం గ్రామంలోని కోటీశ్వరాలయానికి చెందిన 125 ఎకరాల భూమితో పాటు అటవీ భూములు చేజర్ల, కలువాయి సరిహద్దులోని కోటితీర్థం గ్రామ సమీపంలో ఉన్నాయి. గ్రామానికి దూరంగా ఉండటంతో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కొన్నిరోజులుగా ఆలయ భూములతోపాటు అటవీ భూములలో అక్రమంగా మైనింగ్ సాగిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 16 తేదీ పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు అటుగా వెళ్ళడంతో విషయం వెలుగులోకి వచ్చి ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు భూముల వద్దకు వెళ్లేసరికి అక్కడ ఉన్న యంత్రాలను మరో ప్రాంతాలకు తరలించేశారు. ఇక అటవీ శాఖ భూముల్లో జరుగుతున్న తవ్వకాలపై ఆ శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. వారం రోజుల నుంచి రాత్రింబవళ్లు భారీ యంత్రాలను వినియోగించి తెల్లరాయిని వెలికి తీస్తున్నారు. అక్కడి నుంచి పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా సరిహద్దు దాటించేస్తున్నారు. ఇక్కడ తవ్విన క్వార్ట్జ్‌ను టన్ను రూ.3,300 లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇక నెల మామూళ్ల కింద సుమారు రూ.1.8 లక్షలు అధికారులకు అందుతున్నట్లు తెలుస్తోంది. ఇకనైనా దేవదాయ, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి అక్రమ మైనింగ్ చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అటవీ భూమిలో తవ్వకాలకు వినియోగిస్తున్న భారీయంత్రం



శుక్రవారం రాత్రి టిప్పర్లలో తరలిపోతున్న తెల్లరాయి

బీజేపీ క్లస్టర్-4 ఇన్‌చార్జిగా సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 27: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలను ఐదు క్లస్టర్‌లుగా విభజించి క్లస్టర్లకు ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జిలను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి శనివారం రాత్రి జాబితా విడుదల చేశారు. అందులో భాగంగా ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలను క్లస్టర్-4గా విభజించి ఆ క్లస్టర్‌కు ఇన్‌చార్జిగా తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని నియమించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్‌ను క్లస్టర్-4 కోఇన్‌చార్జిగా నియమించారు.

పుష్కలంగా యూరియా నిల్వలు

- ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరి
- ఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి



మాట్లాడుతున్న ఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), జనవరి 27 : రైతు భరోసా కేంద్రాల్లో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ సలహా మండలి(ఏఏబీ) చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఆయన అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మార్కెట్‌లో ధాన్యం ధర ఎక్కువగా ఉందని, ప్రతి ఎకరా ఈక్రాప్ నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే ఈక్రాప్ తప్పనిసరని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వైఎస్‌ఆర్ యంత్రసేవా పథకం ద్వారా సబ్సిడీతో యంత్రాలను అందజేస్తున్నామన్నారు. తొలుత వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, పశు, మత్స్య, ఇరిగేషన్, సహకార శాఖల ద్వారా రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల వివరాలను సంబంధిత అధికారులు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు సత్యవాణి, సుబ్బారెడ్డి, మత్స్య, పశుసంవర్థకశాఖల జేడీలు నాగేశ్వరరావు, మహేశ్వరుడు, జిల్లా సహకారశాఖాధికారి సుధాభారతి, ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త వినీత, నాబార్డు డీడీఎం రవిసింగ్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఏపీ సీడ్స్ డీఎం సుబ్రహ్మణ్యం, వ్యవసాయశాఖ ఏడీలు నర్సోజీరావు, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దత్తపుత్రుడు జగన్‌రెడ్డి

- ఏపీలో దుష్ట పాలనను అంతం చేయాలి
- తెలంగాణ రాష్ట్ర సీపీఐ నేత సాంబశివరావు



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు

వెంకటాచలం, జనవరి 27 : బీజేపీ దత్తపుత్రుడు ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలంగాణ రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మండలంలోని కనుపూరు గ్రామంలో తన చిన్ననాటి స్నేహితుడు డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆహ్వానం మేరకు శనివారం రాత్రి ఆయన వచ్చారు. ఆయనకు కనుపూరు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో నిరంకుశ నియంతృత్వ పోకడాలతో అరాచకపు రాచరిక పాలన ఉందని, దాన్ని అంతమొందించాలన్నారు. జగన్‌రెడ్డి దుష్ట పాలనను అంతం చేయడంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అగ్రపీఠంలో ఉండాలని, భవిష్యత్తులో ఏపీలో మంచి పరిపాలన ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వల్లూరు రమేష్‌నాయుడు, వంశీకృష్ణ, ఉప్పలపాటి ధనుంజయనాయుడు, వల్లూరు శ్రీనివాసులు నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, సాయి నాయుడు, శ్రీహరినాయుడు, అమర్నాథ్, రఫీ తదితరులున్నారు.

అక్కంపేట రామాలయంలో చోరీ

- నగదు, నగలు మాయం



ఆలయంలో స్వామివారి దుస్తులను చిందరవందర చేసిన దొంగలు

మనుబోలు, జనవరి 27: మండలంలోని అక్కంపేట గ్రామంలో ఉన్న రామాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం భక్తులు రాత్రి 11గంటల వరకు భజనలు చేసి గర్భగుడి తలుపులు వేయకుండా మండపం తలుపులు మాత్రమే వేసి తాళం వేశారు. శనివారం ఉదయం ఆలయం శుభ్రం చేసేందుకు వెళ్లిన మహిళ తాళం తీసి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి ఆలయ ధర్మకర్తల మండలికి తెలిపింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చోరులు ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి దేవుళ్ల వస్త్రాలు చిందర వందర చేసి సీతమ్మ మెడలోని మంగళసూత్రం, స్వామి వెండి జంధ్యంతో పాటు మండపంలో ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును తీసుకువెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కులం పేరుతో దూషించి దాడి

నెల్లూరు(క్రైం), జనవరి 27: తల్లీకుమార్తెలను కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట కుసుమ దళితవాడలో నివాసం ఉంటున్న కామాక్షికి నగరానికి చెందిన అనూష, రఘువర్ధన్‌లు పరిచయమయ్యారు. బంగారు వ్యాపారంలో నగదు పెడితే రెండింతలు తిరిగి ఇస్తామని వారు కామాక్షిని నమ్మించారు. వారి మాటలు నమ్మిన ఆమె రూ.8 లక్షలు వారికి ఇచ్చింది. నెలలు గడుస్తున్నా అనూష, రఘువర్ధన్‌లు ఆమెకు నగదు ఇవ్వలేదు. ఈ నెల 21వ తేదీన కామాక్షి తన తల్లితో కలిసి హరనాథపురం వద్ద అనూష, రఘువర్ధన్‌లను నగదు ఇవ్వాలని గట్టిగా నిలదీసింది. కోపోద్రిక్తులైన వారు తమ స్నేహితులు సుకుమార్, రవిరెడ్డి, ప్రసన్నలతో కలిసి కామాక్షి, ఆమె తల్లిని కులం పేరుతో దూషించి దాడి చేశారు. ఈ మేరకు కామాక్షి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ నిందితులపై దాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరాలపై..

- కోడితోపాటు రూ.8,100 నగదు స్వాధీనం

కావలి రూరల్, జనవరి27: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు.ఈ సంఘటన కావలి మండలం చెన్నాయపాలెం, పెదపట్టుపుపాలెం గ్రామాల మధ్యన శనివారం సాయంత్రం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు, కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఒక కోడితోపాటు రూ. 8,100 నగదు స్వాధీనం చేసుకుని, కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు లారీల ఢీ : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలైన డ్రైవర్

మర్రిపాడు, జనవరి 27: రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన నందవరం చెక్‌పోస్టు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బొగ్గు లోడుతో నెల్లూరు వైపు వెళ్తున్న లారీ, కడప వైపు వెళ్తున్న మరో లారీ రెండూ ఢీకొన్నాయి. దీంతో కడప వైపు వెళ్లే లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. తీవ్ర గాయాలతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో పోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీసి చికిత్స నిమిత్తం 108లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సంగం: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... స్థానిక వడ్డిపాళెంకు చెందిన రఘు (20) ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 18వ తేదీ రాత్రి బుచ్చిరెడ్డిపాళెం వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో గాంధీజన సంఘం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గాయాలైన రఘును నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బ్రాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	260
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5963
వెండి కిలో ధర	రూ. 73,300
వెండి ఒక గ్రాము	రూ. 75.30

విద్యుదాఘాతంతో రైతు..

పొదలకూరు, జనవరి 27 : విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని ముదిగేడు గ్రామ పొలంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సైదాపురం మండలం మలిచేడు గ్రామానికి చెందిన దేవరాల చిన్నబ్బయ్య(70) ముదిగేడు గ్రామంలోని తన సవకతోటకు నీళ్లు పెట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మరణించాడు. ఈమేరకు విద్యుత్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చలి చంపేస్తోంది!

- పొగమంచు ప్రభావమూ ఎక్కువే!
- విజృంభిస్తున్న పలురకాల వైరస్‌లు
- పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం

నెల్లూరు (వైద్యం) జనవరి 27 : జిల్లాపై చలి పంజా విసురుతోంది. గత ఏడాది 24 డిగ్రీలకే వణుకు పుట్టించే చలి తీవ్రత ప్రస్తుతం 20 డిగ్రీలకు చేరుకోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాపూరు, ఉదయగిరి, ఇందుకూరుపేట, ముత్తుకూరు, సంగం తదితర మండలాల్లో సముద్రం, అటవీ ప్రాంతాలు ఉండటంతో ఆయా ఆయా ప్రాంతాలపై చలి ప్రభావం ఎక్కువగా ఉంది. దీనికితోడు పొగమంచు కారణంగా రహదారులు పూర్తిగా కానరాక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు వణికి పోతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచే చలి ప్రారంభమవుతుండగా ఉదయం 8 గంటలకు కూడా భానుడు మంచుతెరలను వీడి బయటకు రావడం లేదు.

● వైరస్ ప్రభావం ఎక్కువే..

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే 98.6 డిగ్రీల ఫారన్‌హీట్ అవసరం. 96 ఫారన్‌హీట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయినా 108కి పెరిగినా శరీరం తట్టుకునే పరిస్థితి లేదు. వృద్ధులు, చిన్నారులపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. చలి తీవ్రత కారణంగా రక్తం వెచ్చదనంగా మారి శరీరం చెమటలు పట్టడం జరుగుతుంది. పాల్సీపారం, ఇన్‌ఫ్లూమెంజా వైరస్‌లు సంఖ్య పెరిగి బాధితులపై దాడి చేస్తాయి. దీనివల్ల న్యూమోనియా సోకి ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శరీరంలోని చేతివేళ్లు, కాలివేళ్లు, చెవులు కొసలు వంటి భాగాలకు రక్తప్రసరణ ఆగి చర్మవ్యాధులకు దారి తీస్తుంది. ఫంగస్ సమస్య తలెత్తి రోగ నిరోధక శక్తి సన్నగిల్లుతుంది. అల్ప ఉష్ణోగ్రతలు కారణంగా 60 ఏళ్లపైబడ్డ వృద్ధులకు, ఐదేళ్లలోపు చిన్నారులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీనికితోడు ప్రస్తుతం కరోనా ప్రభావం ఉండటంతో ఈ చలికాలంలోనే ఈ వైరస్ కూడా విజృంభించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే చలి తీవ్రతకు ఎంతోమంది చిన్నారులు శ్వాసకోశ వ్యాధుల సమస్యలతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. బెల్స్‌పాల్సీ అనే వైరస్ వ్యాప్తి చెందుతుండటంతో పక్షవాతాన్ని పోలే మూతి నొక్కుడు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మహిళల్లో హార్మోన్ల సమస్య అధికమవుతుంది. చలి తీవ్రత వల్ల గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ సరిగా జరగక ప్రాణాపాయ స్థితికి దారితీస్తుంది.





ఇళ్లు, జాతీయ రహదారిని కమ్మేసిన పగమంచు

● ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి..

చలి నుంచి విముక్తి పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఆస్తమా, నెమ్ము, జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులతోపాటు జ్వరాలబారిన పడుతూ ఆసుపత్రుల పాలవుతున్నారు. చిన్నపిల్లలు నుంచి వృద్ధుల వరకు రోగాల బారిన పడుతున్నారు. చలికాలం ముగిసే వరకు ప్రజలంతా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఉన్ని దుస్తులు ధరించడంతోపాటు మంకీ టోపీ, స్వెటర్లు శరీరం పూర్తిగా కప్పేలా దుస్తులు, కాళ్లకు సాక్సులు వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
20	21.0	31.0
21	22.4	31.2
22	21.0	32.3
23	21.2	33.1
24	19.0	32.0
25	20.0	31.0
26	21.0	31.1

తప్పుల తడకగా ఓటర్ల జాబితా



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న గ్రామస్థులు

బిట్రగుంట, జనవరి 27: తాజాగా వచ్చిన ఓటరు జాబితా తప్పులు తడకలుగా ఉండటంతో తమ ఓట్లు ఉన్నాయో లేదో... అన్న ఆందోళనతో బోగోలు వాసులు సతమతమౌతున్నారు. మృతిచెందిన వారి ఓట్లు జాబితాలో ఉండి, నూతనంగా చేర్చిన యువకుల ఓట్లు లేకపోవడంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో గ్రామీణులు ఉన్నారు. చదువులు, ఉద్యోగాల నిమిత్తం ఇతర జిల్లాలకు వెళ్లిన యువత ఓట్లు నమోదు కాకపోవడంతో బీఎల్‌వోల పనితీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సతీష్‌బాబు కాండ్ర ఓటుకు మరొకరి ఫొటో ఉంది. ఇదేమని సచివాలయ సిబ్బందిని అడిగితే తామేమి చేయలేమని చేతులెత్తేశారు. మృతి చెందిన బచ్చు రాలింగయ్య పేరు ఓటరు జాబితాలో ఉండటం చూసిన స్థానికులు కంగుతున్నారు. ఇప్పటికైనా జాబితాలో తప్పులు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటరు జాబితాలో మృతుల పేర్లు

- తొలగించని అధికారులు

వరికుంటపాడు, జనవరి 27: ఓటరు జాబితా తయారీలో ఎన్నికల కమిషన్ అనేక నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ అధికారుల్లో మాత్రం నిర్లక్ష్యం వీడనే లేదు. అందుకు నిదర్శనమే తూర్పుకొండారెడ్డిపల్లిలో చోటుచేసుకున్న సంఘటన. బూత్ నంబరు 83లో గతంలో 46 మంది మృతుల ఓట్లు ఉండడంతో దరఖాస్తులు అందుకున్న అధికారులు పూర్తి స్థాయిలో వాటిని తొలగించనే లేదు. ప్రస్తుత జాబితాలోను ఏడుగురు మృతుల పేర్లు అలాగే ఉండడం చూస్తుంటే అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రెండేళ్లు కావస్తున్నప్పటికీ మృతుల పేర్లు తొలగించకపోవడంతో దొంగ ఓట్లను అధికారులే ప్రోత్సహిస్తున్నట్లవుతోంది. అలాగే పలు గ్రామాల్లో వలస వాసుల ఓట్లు సైతం అధిక సంఖ్యలోనే దర్శనమిస్తుండడం గమనార్హం.

నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులు

- తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు



నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు

విడవలూరు, జనవరి 27 : నకిలీ విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నకిలీ విత్తనాల కారణంగా అలగానిపాడులో నష్టపోయిన రైతులను పంట పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీటీ 5204 విత్తనాలను నాటిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, సాధారణంగా బీపీటీ వేసిన వరిపైరు సుమారు నాలుగు నెలల నుంచి 5నెలల లోపు దిగుబడి వస్తుందన్నారు. అయితే నంద్యాలకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ సరఫరా చేసిన విత్తనాల కారణంగా నాటిన వరి 70రోజులకే మొలకలు వచ్చాయని, దీని వల్ల ఎకరాకు 2పుట్లు వచ్చే అవకాశాలు లేవన్నారు. దీంతో రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా రావన్నారు. నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టాల్సిన ప్రభుత్వ అధికారులు మామూళ్లకు అలవాటుపడి, రైతులను దగా చేస్తున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, స్థానిక రైతులు మాతూరు శ్రీనివాసురెడ్డి, హరనాథ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సమృద్ధిగా ఎరువులు: ఏవో నాగమోహన్




ఎరువు నిల్వలను పరిశీలిస్తున్న ఏవో నాగమోహన్

నెల్లూరురూరల్, జనవరి 27 : రైతులకు కావాల్సిన ఎరువులు తమ వద్ద నిల్వ ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నెల్లూరురూరల్ మండల వ్యవసాయ అధికారి ఎస్వీ నాగమోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం మండలంలోని సౌత్‌మోపూరులో ఆయన సహకార శాఖ గోదాముల్లో నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలించారు. ఎరువుల కోసం రైతుల పడిగాపులంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించిన ఆయన గ్రామానికి వెళ్లి ఎరువుల కొరతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న అన్నదాతలు అవసరాలను బట్టీ ఎరువులు తీసుకోవాలని సూచించారు. అన్ని విడతలకు ఒకేసారి యూరియా తీసుకోవడం వల్ల పంపిణీలో లోపం ఏర్పడే అవకాశం ఉందని, తయారీ కంపెనీల నుంచి అవసరాలను బట్టీ యూరియా వస్తుందని, ఆ మేరకు వాడుకోవాలని రైతులకు సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రశాంత ఎన్నికలకు పోలీస్ శాఖ సంసిద్ధం

- ఐజీ పాల్‌రాజ్



ఐజీ పాల్‌రాజ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎస్పీ, సీఐలు

కావలి, జనవరి27: ఎన్నికలకోడ్ త్వరలో అమల్లోకి రానుండటంతో ప్రశాంత ఎన్నికల కోసం పోలీస్ శాఖను సంసిద్ధం చేస్తున్నట్లు గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజ్ తెలిపారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముందు ఐజీ విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికలు జరగాలంటే ప్రజలకు పోలీసులపై నమ్మకం ఉండాలన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రశాంత వాతావరణం కల్పించేందుకు పోలీస్‌శాఖ ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో రాజకీయ గొడవలు, కుటుంబాలు, కులాలు, మతాల మధ్య రకరకాల గొడవలు ఉంటాయన్నారు. అలాంటిచోట రౌడీలను, పీడీ యాక్ట్ ఉన్న వారిని గుర్తించి వారిని బైండోవర్ చేసుకోవాలన్నారు. ముందుగా గొడవలను అదుపుచేయకపోతే ఎన్నికల సమయంలో నేరాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందన్నారు. అలాంటి గ్రామాలకు అదనపు ఫోర్స్ పెట్టడం, ఎన్నికల రోజు మొబైల్ వాహనాలు, రూట్ ఆఫీసర్లు అక్కడ ఎక్కువ సమయం కేటాయించి నిఘా ఏర్పాటు చేసేలా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లటం జరుగుతోందన్నారు. ఓపెన్ డ్రింకింగ్ సమస్య ఉంటే అలాంటి చోట కూడా గొడవలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వాటిని గుర్తించి తగిన చర్యలు చేపడతామని చెప్పారు. బెల్టు షాపులు, ఇతర రాష్ట్రాల మద్యం, చీప్‌లిక్కర్, అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్రం నలుమూలల 22 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉన్నాయని తెలిపారు. అక్రమ మద్యంతోపాటు, నగదు పంపిణీలు జరగకుండా ముదస్తు ఏర్పాట్లు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, కావలి డీఎస్పీ ఎం. వెంకటరమణ, కావలి ఒకటోపట్టణ, రెండోపట్టణ, రూరల్, కలిగిరి, ఉదయగిరి సీఐలు పాల్గొన్నారు.

పెంచలకోన అడవుల్లో దారితప్పిన భక్తులు

- రోజంతా అటవీ ప్రాంతంలో గడిపిన భక్తులు
- గూగుల్ లోకేషన్ ఆధారంగా గుర్తించిన పోలీసు, అటవీశాఖ సిబ్బంది
- ఎట్టకేలకు స్వామివారి దర్శనం



పెంచలకోన అడవుల్లో దారితప్పిన భక్తులను సురక్షితంగా కోనకు తీసుకువస్తున్న పోలీసులు

రాపూరు(డక్కిలి), జనవరి 27 : పెంచలకోన నృసింహస్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకునేందుకు అన్నమయ్య జిల్లా అటవీ ప్రాంతం నుంచి కొండల్లో కాలినడకన బయలుదేరిన అన్నమయ్య జిల్లా నందలూరు మండలం కుంపనిపురం గ్రామానికి చెందిన భక్తులు మార్గమధ్యంలో పెంచలకోన అడవుల్లో దారితప్పిన సంఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ మాలాద్రి కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి. అన్నమయ్య జిల్లా నందలూరు మండలం కుంపనిపురం గ్రామానికి చెందిన సింగనమాల నరసయ్య, గంగాధర్, శరత్‌కుమార్, మంజునాథ్, నాగరాజు, హరికృష్ణ, శివకృష్ణలు పెంచలకోన నృసింహస్వామిని దర్శించుకుని మొక్కు చెల్లించుకునేందుకు శుక్రవారం ఉదయం కుంపనిపురం నుంచి నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోనకు అటవీ ప్రాంతం నుంచికాలినడకన బయలుదేరారు. సాయంత్రం 4 గంటలకు మార్గమధ్యంలో కొండల్లో దారితప్పి రాత్రంతా బిక్కుబిక్కుమంటూ అడవుల్లోనే గడిపారు. శనివారం ఉదయం 122 పోలీసు నెంబరుకు డయిల్ చేసి తాము అడవుల్లో దారితప్పిపోయామని, తమ వెంట తెచ్చుకున్న నీరు, ఆహార పదార్థాలు అయిపోయి ఇబ్బందులు పడుతున్నామని, తమను ఎలాగైనా కాపాడాలని ఫోన్‌లో వేడుకున్నారు. దీంతో జిల్లా ఎస్పీ రాపూరు పోలీసులను అప్రమత్తం చేశారు. శనివారం ఉదయం పోలీసులు, అటవీ సిబ్బంది, ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్ళు తీసుకొని గూగుల్ లోకేషన్ ఆధారంగా పెంచలకోన అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టి మధ్యాహ్నానికి భక్తుల ఆచూకీ కనుగొన్నారు. వారందరినీ పెంచలకోనకు తీసుకువచ్చి బంధువులకు అప్పగించారు. అనతంరం వారికి ఆలయ కమిషనర్ జనార్దనరెడ్డి స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

గ్రూపు-1, 2 శిక్షణ కోసం సంప్రదించండి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 27 : బీసీ సం క్షేమ శాఖ అధ్వర్యంలో నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఏపీపీఎస్సీ గ్రూపు-1, 2 ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్షణను గత డిసెంబరు 27న ప్రారంభించామని బీసీ సంక్షేమశాఖాధికారి వై. వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణతో పాటు ప్రతి రోజు సబ్జెక్టులకు సంబంధించి ప్రాక్టీసు టెస్టులు, గ్రాండ్ టెస్టు లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. లైబ్రరీ సౌకర్యం, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల బీసీ, ఎస్సీ, ఎస్టీ షైనారిటీలకు సంబంధించిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ కోసం జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని సంప్రదించాలని తెలిపారు. లేదా 0861-2338300, 9381554779ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

1న పింఛను చెల్లించాలి

- రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 27 : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పెన్షనర్లకు ప్రతి నెల 1వ తేదీన పింఛను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం. గౌస్ బాషా, కార్యదర్శి ఎస్వీవీఎస్.మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 29వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ తరలి రావాలని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో పెన్షనర్స్‌కు సంబంధించి అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాలు, 11వ పీఆర్‌సీ అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. పెన్షనర్స్ హెల్త్‌కార్డులపై అన్ని రకాల వ్యాధులకు అన్ని ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వరికుంటపాడు: జీ కొండారెడ్డిపల్లి శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. శనివారం ఎస్ఐ తిరుపతయ్య మాట్లాడుతూ సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని, రూ. 19,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు

ఉదయగిరి, జనవరి 27: ఉదయగిరిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో, తహసీల్దారు, సబ్‌ట్రెజరీ, హౌసింగ్, గ్రంథాలయం, విద్యుత్ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కాగా, వృథాగా ఉన్న భవనాలను వినియోగంలోకి తీసురాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, అగ్రిల్యాబ్ భవనాన్ని 2023లో రూ.48 లక్షలతో నిర్మించారు. ప్రారంభించినప్పటికీ భవనంలో సేవలు అందుబాటులోకి రాక నిరుపయోగంగా మారింది. అలాగే గతేడాది రూ.1.08 కోట్లతో నిర్మించిన సబ్ ట్రెజరీ కార్యాలయం వాడుకలోకి రాక నిరుపయోగంగా మారింది. అసంపూర్తిగా నిర్మించిన కార్యాలయంలో నేటికీ సేవలు అందుబాటులోకి రాలేదు. రూ.38 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం ఏడాదిగా ప్రారంభోత్సవానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. ఈ భవనంలో రంగులు వెలసి చుట్టూ ముళ్లపొదలతో కార్యాలయ ఆవరణ చిట్టడవిలా తయారైంది. లక్షలతో నిర్మించిన ఈ భవనాలు వృథాగా విడిచిపెట్టడంపై విమర్శలకు తావిస్తోంది. తహసీల్దారు, ఎంపీడీవో, సబ్ ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్, గ్రంథాలయం, హౌసింగ్ కార్యాలయ భవనాలు స్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు కూలుతాయోనని భయాందోళన నడుమ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భవనాలను వాడుకలోకి తీసుకురావాలని సిబ్బంది కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న తహసీల్దారు కార్యాలయం

వెంగమాంబకు ప్రత్యేక పూజలు


ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 27: ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా శనివారం దుత్తలూరు వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు బెల్లంకొండ పెద్దభద్రయ్య, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి టెండర్ల పూర్తి

ఉదయగిరి, జనవరి 27: నియోజకవర్గంలోని పలు రోడ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయినట్లు ఆర్అండ్‌బీ డీఈ చక్రధర్‌రావు శనివారం తెలిపారు. నందవరం కూడలి నుంచి 16వ కిలోమీటర్ వరకు రూ.6 కోట్లు, ఆదిమూర్తిపురం నుంచి గొల్లవారిపల్లి రోడ్డు వరకు రూ.3 కోట్లకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు.

సిమెంట్‌రోడ్డు పనుల ప్రారంభం

ఉదయగిరి రూరల్, జనవరి 27: మండలంలోని కృష్ణంపల్లి గ్రామంలో సిమెంట్‌రోడ్డు పనులను ఎంపీడీవో ఈశ్వరమ్మ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్కి ప్రమీల, సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, నాయకులు కొండ్రెడ్డి వీరారెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, గొల్లపల్లి తిరుపతి, వీరశేఖర్‌రెడ్డి, వెంగళరెడ్డి, వినయ్‌రెడ్డి, ఈవోపీఆర్డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం

సంగం, జనవరి 27: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో పంచాయతీ నిధులతో డ్రైనేజి నిర్మాణానికి శనివారం శ్రీకారం చుట్టారు. గడప గడప నిధులతో నిర్మించాలని సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి భావించారు. అయితే సిద్దీపురం సచివాలయం పరిధిలో ఉన్న ఈ గ్రామానికి నిధులు కేటాయించలేదు. దీంతో పంచాయతీ నిధులతోనే డ్రైనేజి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

విద్యార్థులకు విజయ దీపికల పంపిణీ

ఉదయగిరి, జనవరి 27: మండలంలోని గడ్డంవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విజయ దీపికలను ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య శనివారం అందజేశారు. స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకొని పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

చేతిరాత పోటీల్లో
కావలియడవల్లి విద్యార్థినుల ప్రతిభ

ఏఎస్ పేట, జనవరి 27: ఇటీవల నెల్లూరులో చేతిరాత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో కావలిఎడవల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చూపారని హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. పోటీలలో హైస్కూల్ విద్యార్థినులు వర్షిత, హర్షిణి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందుకున్నారని తెలిపారు. వారిని శనివారం ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ దినోత్సవం

ఉదయగిరి రూరల్, జనవరి 27: పట్టణంలో శనివారం ఎలక్ట్రీషియన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్స్ యూనియన్ సభ్యులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్స్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గొర్రెల మృతి

మర్రిపాడు, జనవరి 27: గొర్రెల మందపై 12 కేవి విద్యుత్ వైరు తెగిపడటంతో విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతిచెందాయి. సబ్‌స్టేషన్‌లో త్రీఫేస్ విద్యుత్ సరఫరా వదలటంతో ట్రిప్ అయ్యి లైన్ తెగి పడినందున ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. 30వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు రైతు గంగినేని తిరుపతయ్య వాపోయారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, జనవరి 27: ఇటీవల పట్టణంలో మృతి చెందిన నలుగురి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేల వంతున కంచి పరమేశ్వరరెడ్డి ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు దగుమాటి శివకోటారెడ్డి, రిటైర్డ్ ప్రధానోపా ధ్యాయుడు కేవి శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడి పా ల్గొన్నారు.

11న టాలెంట్ టెస్ట్


మాట్లాడుతున్న అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ తదితరులు

ఆత్మకూరు, జనవరి 27 : అపస్ ఆధ్వర్యంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని 10వ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 11వ తేదీన టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి అనీల్‌కుమార్ తెలిపారు. స్థానిక మేధా హైస్కూల్‌లో శనివారం టాలెంట్ టెస్ట్‌కు సంబంధించి డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లీషు సబ్జెక్టులకు సంబంధించి పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు.

రెవెన్యూ సదస్సులో అర్జీల వెల్లువ


అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

కలువాయి, జనవరి 27: కలువాయి తహసీల్దారు కార్యాలయ ఆవరణలో శనివారం కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలకు సంబందించి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్ దరఖాస్తులు స్వీకరించారు. రైతులు పెద్దఎత్తున భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ మాదాసు యజ్ఞపవన్, వైసీపీ మండల కన్వీనర్ ఎం కృష్ణారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ వీ సంజనాసిన్హా, ఆత్మకూరు ఆర్డీవో మధులత, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

వింజమూరు, జనవరి 27 : మండల పరిషత్ అధ్యక్షుడు ఐ మోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావశంలో అన్ని శాఖల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని సభలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో మురళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు సుమలత, హైమావతి, ప్రసన్న, వంశీ, రత్నమ్మ, పల్లాల కొండారెడ్డి, అనంగి రమణయ్య, సాదం మౌనిక, బుక్కాపురం సర్పంచ్ రసూల్, కాటేపల్లి సర్పంచ్ విజయలక్ష్మీ, మండల స్థాయి అధికారులు కాటం రమణారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మూలె పద్మజా వినయ్‌రెడ్డి

ఉదయగిరి, జనవరి 27: రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని ఎంపీపీ మూలె పద్మజావినయ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మంచినీటి పథకాల నిర్వహణ, చేతిపంపుల ఏర్పాటు, మురికి కాలువలు, సిమెంట్‌రోడ్డు నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశానికి హాజరుకాని వివిధ శాఖల అధికారులపై చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, సాహిత్యా అకాడమీ డైరెక్టర్ అక్కి భాస్కర్‌రెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ మూలె వినయ్‌రెడ్డి, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో టీ శ్రీనివాసులు, డీటీ ఫజియా తదితరులు పాల్గొన్నారు.

'కేశమనేనిపల్లి రైతులపై ఆరోపణలు తగదు'

కలువాయి, జనవరి 27: కేశమనేనిపల్లిలో వివాదాస్పద భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ గ్రామానికి చెందిన రైతులు, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణపై చేసిన ఆరోపణలను శనివారం కలువాయి మండల టీడీపీ నాయకులు, రైతులు తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమవేశంలో వారు మాట్లాడుతూ ఈ భూముల వ్యవహారం కోర్టులో ఉందని, అలాంటప్పుడు ఈ భూములు ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు, నియోజకవర్గ కార్యదర్శి గడ్డం కిషోర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేత

ఆత్మకూరు, జనవరి 27: ఆడుదాం అంధ్రా టోర్నమెంట్‌లో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారికి శనివారం అధికారులు ట్రోఫీలు, మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేశారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో ఆత్మకూరు జట్టు, క్రికెట్‌లో మర్రిపాడు, కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్‌లో సంగం మండలం జట్లు, ఖోఖోలో ఏఎస్‌పేట జట్టు విజేతలుగా నిలిచారు. విన్నర్స్‌గా నిలిచిన జట్లన్నీ జిల్లాస్థాయిలో జరుగు పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించినట్లు వారు తెలిపారు.

వింజమూరు : ఆడుదాం అంధ్ర పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో ఉదయగిరి జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానాన్ని సీతారామపురం జట్టు బహుమతులను అందుకున్నారు. వింజమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

ఏఎస్ పేట, జనవరి 27: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మహిళలకు ఆసరా చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, ఎంపీపీ పద్మజారెడ్డి, రాజవోలు సొసైటీ చెర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ చెర్మన్ నరసింహారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సందాని, నాయకులు షేక్ జిలానీబాషా, కోటిరెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పొదుపు మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పొదుపు రుణాలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, జడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీవో మధుసుధన్‌రావు, ఏపిఎం రమణరావు తదితరులు పాల్గొన్నారు.

రా.. కదలిరా సభను జయప్రదం చేయండి : బొల్లినేని


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జనవరి 27: నెల్లూరులో ఆదివారం నిర్వహించే రా.. కదలిరా సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పిలుపనిచ్చారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాల యంలో మండల నాయకులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేఖరులలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొనే ఈ సభకు మండలం నుంచి అత్యధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నుంచి పదివేల మంది సభకు తరలి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. అందుకు తగ్గట్లుగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వికాస్‌హరికృష్ణ, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, నాయకులు కండ్లగుంట వెంటరెడ్డి, కాకర్ల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఉదయగిరి రూరల్: ఉదయగిరి పట్టణానికి చెందిన కిశోర్ ట్రేడర్స్ అధినేత, టీడీపీ నాయకుడు వాయుగుండ్ల ఖాజారావు అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గ పరిశీలకుడు వికాస్‌హరికృష్ణ, టీడీపీ మండల కన్వీనర్లు బయ్యన్న, మధు, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, గూడూరు వెంకటేశ్వరరావు, సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్ తదితరులున్నారు.

చంద్రబాబు సభకు భారీగా తరలిరావాలి

సీతారామపురం : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం నెల్లూరులో నిర్వహిస్తున్న రా..కదలిరా కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఆదేశాల మేరకు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలి రావాలని మండల టీడీపీ సీనియర్ నాయకుడు చింతల శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. నెల్లూరు వెళ్ళుటకు మండలంలోని బసినేనిపల్లి సెంటర్‌కు ఉదయం 7గంటల కల్లా రావాలని ఈ సందర్భంగా శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

ఆలయ అభివృద్ధే ధ్యేయం


ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు


స్వామివారి దర్శనానికి వెళ్తున్న ఇంటూరి నాగేశ్వరావు దంపతులు

వలేటివారిపాలెం, జనవరి 27: మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్దే తమ ప్రధాన ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. మాలకొండ స్వామిని శనివారం ఎమ్మెల్యే దర్శించుకుని, నారసింహ, సుదర్శనయాగం చేయించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయన్ను శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. కాగా లక్ష్మీనరసింహస్వామిని శనివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరావు తన సతీమణి సౌజన్యతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు కామినేని అశోక్ తదితరులు ఉన్నారు.

● మాలకొండ ఆదాయం రూ. 8,27,303

లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 8,27,303 ఆదాయం లభించినట్లు ఆలయ ఏసీ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 6,400, కుంకుమార్చన ద్వారా రూ. 25,760, తలనీలాల ద్వారా రూ. 30,950, వాహనపూజల ద్వారా రూ. 3,360, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,10,300, స్థల పురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 1,400, రూముఅద్దెల ద్వారా రూ. 33,670, కవర్ల ద్వారా రూ. 5,400, లడ్డూప్రసాదం ద్వారా రూ. 1,97,185, అన్నదానం ద్వారా రూ. 2,52,646, విరాళాల ద్వారా రూ. 60,232 ఆదాయం లభించిందని ఆయన వివరించారు.

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న బెనర్జీ

కావలి, జనవరి27: ఏపీ విద్యుత్ మండలి, రాష్ట్ర విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై సోమవారం నుంచి ఫిబ్రవరి 1 వరకు ప్రజాభిప్రాయసేకరణ చేపడుతున్నట్లు కావలి ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కేఎస్ బెనర్జీ తెలిపారు. కావలి విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణకు స్థానిక డివిజనల్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ నాలుగు రోజుల్లో ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు.

కందుకూరు : విద్యుత్ చార్జీలపై సోమవారం నుంచి ఫిబ్రవరి 1 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కందుకూరు డివిజనల్ ఈఈ ఎ. వీరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. వినియోగదారులు పట్టణంలోని విప్పగుంట రోడ్డులో ఉన్న డివిజన్ కార్యాలయానికి వచ్చి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులకు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చునని ఆయన తెలిపారు.

చెరువుల పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్, సోమశిల, వ్యవసాయశాఖ అధికారులు

కావలి రూరల్, జనవరి27: పంటలు చివరిదశలో ఎండిపోకుండా, నీటిఎద్దడి నివారణకు కావలి మండలంలోని చెరువులు పరిశీలించినట్లు నీటిపారుదల శాఖ ఎస్సీ కృష్ణమోహన్ పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపెంట, ముసునూరు, మన్నంగిదిన్నె, కొత్తసత్రం చెరువులల్లోని నీటిని శనివారం నీటిపారుదలశాఖ, సోమశిల రిజర్వాయర్, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. కొన్ని చెరువు ల్లో తూములకు నీరు అందని పరిస్థితి ఉన్నట్లు రైతులు తెలపటంతో వాటిని గుర్తించి వారితో మాట్లాడామన్నారు. చెరువులకు అవసరమైన నీటిని సోమశిల రిజర్వాయర్ నుంచి తీసుకునేలా రిపోర్టు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో సోమశిల డీఈ పీ మహేష్, ఇరిగేషన్ డీఈ పీఎం. ఖాన్, ఏఈలు ఆర్. హరీష్‌కుమార్, జంపాని కిరణ్‌కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారిణి లలిత తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న విక్రమ్ సిన్హా

కావలి, జనవరి27: మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో శనివారం కావలి సబ్ జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జీ. విక్రమసిన్హా పాల్గొని, ఖైదీలకు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సభ్యుడు ఐ.సాయి ప్రసాద్, లోక్ అదాలత్ సభ్యుడు ఎం. మాలకొండారెడ్డి, సబ్‌జైలు సూపరింటెండెంట్ చిన సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం, జనవరి27: పొదుపు మహిళలకు రుణమాఫీలో భాగంగా వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ శనివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరయిన ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం పొదుపు మహిళలకు రుణమాఫీ చేస్తున్నాడన్నారు. రానున్న ఎన్నికలలో తిరిగి వైసీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఎమ్ మనోహర్, వైసీపీ నాయకులు చిమ్మిలి రాజేంద్రప్రసాద్, వీ మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో పొదుకు మహిళలకు శనివారం ఆసరా చెక్కును కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అందచేశారు. ఆఫ్కాబ్ చైర్మన్ అనిల్‌బాబు, ఎంపీపీ సుజాత, సర్పంచు అనిత, జడ్పీటీసీ కీర్తన జ్యోతి తదితరులు ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎంపీడీవో వెంకటసుబ్బారావు, ఏపీఎం నాగమణి, వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలను నిషేధించాలని పోస్టర్ల ఆవిష్కరణ

లింగసముద్రం : ఈవీఎంలను నిషేధించాలని భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం వెంకట్రావు డిమాండ్ చేశారు.శనివారం సాయంత్రం లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద ఆయన గ్రామస్థులతో కలిసి ఈవీఎంలను నిషేధించాలని పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈవీఎంలను మేనేజ్ చేసుకొని అధికారం చేపడుతున్న పార్టీల కుట్రపూరిత మోసాలను వ్యతిరేకిస్తూ ఈనె 31న ఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పి బాలకోటయ్య, మాజీ సర్పంచి యూ నాగేశ్వరరావు, కో-ఆప్షన్ షేక్ షఫీ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీల విజేతలు వీరే..!

కందుకూరు : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీల విజేతల వివరాలను అధికారులు శనివారం సాయంత్రం ప్రకటించారు. నియోజకవర్గ స్థాయిలో పురుషుల వాలీబాల్‌లో విజేతగా ఉలవపాడు జట్టు నిలవగా, ద్వితీయ బహుమతిని కందుకూరు, తృతీయ బహుమతిని గుడ్లూరు దక్కించుకున్నాయి. బ్యాడ్మింటన్‌లో కందుకూరు, లింగసముద్రం, ఉలవపాడు జట్లు, కబడ్డీలో గుడ్లూరు, ఉలవపాడు, కందుకూరు, జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే మహిళల వాలీబాల్‌లో కందుకూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, బ్యాడ్మింటన్‌లో లింగసముద్రం, కందుకూరు, వలేటివారిపాలెం, కబడ్డీలో ఉలవపాడు, కందుకూరు, లింగసముద్రం, క్రికెట్‌లో కందుకూరు (బృందావనం జట్టు), లింగసముద్రం, గుడ్లూరు మండలాల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. మహిళల ఖోఖోలో గుడ్లూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి.

తాగి వాహనాలు నడిపితే కేసులు

లింగసముద్రం : మద్యం తాగి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు చెప్పారు.శనివారం సాయంత్రం లింగసముద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆయన డ్రంకన్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలను నడిపిన కొందరిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఎం బాజీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంగళరావునగర్‌లో వికసిత్ భారత్


ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ తదితరులు

కావలిటౌన్, జనవరి27: స్థానిక వెంగళరావునగర్ సచివాలయ పరిధిలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో కేంద్ర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో బీజేపీ నాయకులు బ్రహ్మానందం, కందుకూరి సత్యానారాయణ, గుడ్లపల్లి భరత్‌కుమార్, సీవీసీ సత్యం, మందా కిరణ్‌కుమార్, సవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తూమును పూడ్చేశారు..
మురుగు నీరు నిలిచింది !


తూమును పూడ్చడంతో నిలిచిన మురుగు

కందుకూరు, జనవరి 27: పట్టణంలోని చుట్టుగుంట రోడ్డులో మురుగునీరు వెళ్లే తూమును పూడ్చివేశారు. దీంతో మురుగంతా కాలనీలో నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. హైవే నిర్మాణ పనుల కోసం ఈ రహదారిలో భారీ టిప్పర్లు తిరగటంతో కల్వర్టు పగిలిపోయింది. ఇంకా కొత్తది ఏర్పాటు చేయలేదు. దీంతో మురుగునీరు నాలుగు అడుగుల లోతున నిలిచిపోవడంతో శ్రీనగర్‌కాలనీ, బండపాలెంలోని అంతర్గత కాలువల్లోనూ దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా కల్వర్టు నిర్మించాలని వారు కోరుతున్నారు.

బహుజనుల రాజ్య సాధన లక్ష్యం

● బీసీవై పార్టీ అధ్యక్షుడు


కార్యకర్తలతో ముచ్చటిస్తున్న రామచంద్ర యాదవ్

ఉలవపాడు, జనవరి 27 : బహుజనుల రాజ్యం సాధన కోసమే పుట్టిందే భారత చైతన్య యువజన(బీసీవై) పార్టీ అని ఆ పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. రాజమండ్రి వెళుతూ శనివారం సాయంత్రం ఆయన మన్నేటికోట అడ్డరోడ్డు ఆగి, అభిమానులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించడం అసాధ్యమని, ఆపై వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికలపై నాలుగు,ఐదు రోజుల్లో స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. స్థానిక పరిస్థితులపై కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

వీణాధరికి ప్రథమ బహుమతి

కలిగిరి : జన భాగీదరి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పేరాబత్తిన వీణాధరి ప్రతిభ చూపి ప్రథమ బహుమతి సాధించనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 11న అంబేడ్కర్ సామాజికన్యాయం అనే అంశంపై జిల్లాస్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీలో ప్రతిభ చాటి రూ.50 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థినికి తర్ఫీదునిచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు కే.వెంకటేశ్వర్లు, విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

షర్మిల రాకతో కొత్త ఉత్సాహం

బిట్రగుంట : పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం వచ్చిందని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.సురేష్‌బాబు అన్నారు. బోగో లు మండలం కప్పరాళ్లతిప్ప హైవేపై శనివారం రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఎస్‌కే.జహీర్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆమెను కలుసుకున్నారు. రెండు నిమిషాలు మాట్లాడారు.

ముగిసిన ఆటల పోటీలు

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట రామస్వామి క్రీడామైదానంలో ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీలు శనివారం ముగిశాయి. క్రికెట్‌లో ఉమామహేశ్వరపురం జట్టు విజేతగా నిలిచి రూ. 20 వేలు సొంతం చేసుకుంది. చెడుగుడు పోటీల్లో ఫ్రెండ్స్ క్లబ్ మొదటి నగదు బహుమతి రూ.10,116ని పొందింది. విజేతలకు త్రిపుర కన్‌స్ట్రక్షన్ అధినేత పసుపులేటి సుధాకర్ బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ క్లబ్ కమిటీ సభ్యులు పాయసం సాయిమనోజ్, సాతుపాటి రాహుల్, చిన్నరమేష్, రాజశేఖర్ ఆయన అభినందించారు.

మౌలిక వసతులు కల్పించండి

లింగసముద్రం : గిరిజన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి శనివారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యే

కోవూరు,జనవరి 27: స్థానిక రుక్మిణి కల్యాణ మండపంలో శనివారం జరిగిన పొదుపు సంఘాల ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్‌ జిల్లా చైర్మన్‌ దొడ్డంరెడ్డి నిరంజనబాబురెడ్డి, ఎంపీపీ పార్వతి,జడ్పీటీసీ శ్రీలక్ష్మి, పీఏసీసీ చైర్మన్‌ మల్లికార్జునరెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ రాధా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం వాటిల్లితే కఠిన చర్యలు

కోవూరు, జనవరి 27: దళితులు, గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐడీ విభాగం సీఐ ఏ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిషత్‌ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు చట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. సీఐడీ విభాగం ఎస్‌ఐలు షాజహాన్‌, మౌనుషా మాట్లాడారు.

రేబాలలో రైతు సదస్సు

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి27: మండలంలోని రేబాలలో ఉన్న సత్యసాయి కల్యాణ మండపంలో తిరుపతి ఎస్‌వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం రావే (రూరల్‌ అవేర్‌నెస్‌ వర్క్‌ ఎక్స్‌పీరియన్స్‌ ప్రోగ్రాం) కార్యక్రమంపై శనివారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సేంద్రీయ వ్యవసాయం, సమగ్ర సస్యరక్షణ తదితర అంశాలపై నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు, లోకేష్‌బాబు, కిరణ్‌ కుమార్‌, ప్రొఫెసర్‌ నాగమణి, స్థానిక పెద్దలు ఏటూరి శివ రామకృష్ణారెడ్డి, టీవీఆర్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకయ్య స్వామి ఊరేగింపు

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి27: మండలంలోని జొన్నవాడలో శనివారం రాత్రి భగవాన్‌ వెంకయ్యస్వామి ఊరేగింపు వైభవంగా జరిగింది. స్థానిక వరదరాజస్వామి ఆలయం పక్కన ఉన్న వెంకయ్య స్వామి ఆలయ పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రా.. కదలిరా సభను విజయవంతం చేయండి

వెంకటాచలం, జనవరి 27 : నెల్లూరు నగరంలోని సింహపురి హాస్పిటల్‌ సమీపంలో ఎస్‌వీజీఎస్‌ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం జరిగే రా కదిలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్‌ పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగే రా కదలిరా సభకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సారథ్యంలో అన్ని గ్రామాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

తోటపల్లిగూడూరు: రా కదలిరా సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రా... కదలిరా సభకు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పీడీ యాక్టుపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక అంబేడ్కర్‌ భవన్‌లో శనివారం పీడీ యాక్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సోషల్‌ వెల్ఫేరు డిప్యూటీ డైరెక్టర్‌ కే.రమేష్‌ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ హైమారావు, ఎంపీడీవో నరసింహారావు ఎస్సీ, ఎస్టీ చట్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్‌ వార్డెన్‌ సునీల్‌, మురళి పలువురు నాయకులు, దళితులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతగా బుచ్చి జట్టు

బుచ్చిరెడ్డిపాళెం: గత మూడురోజులుగా బుచ్చిలో జరిగిన కోవూరు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లో కబడ్డీ విజేతగా బుచ్చి జట్టు నిలిచింది. ఈ మేరకు శనివారం రెఫరీలు, చీఫ్‌ రెఫరీలు, ఈవోపీఆర్డీ రామ్మోహన్‌, పీఈటీ,పీడీలు బీవీ. రమణయ్య, సచివాలయ సెక్రటరీల చేతుల మీదుగా జట్టు క్రీడాకారులు కప్‌ అందుకున్నారు.

కమనీయం నృసింహుడి కల్యాణం

రాపూరు(డక్కిలి), జనవరి 27 : పెంచలకోనలో పెనుశిల నృసింహస్వామి కల్యాణం శనివారం కనుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం 10-30 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం వేడుకగా సాగింది. స్వామి వారికి కల్యాణ చదివింపులకు, అక్షింతల కోసం భక్తులు పోటీపడ్డారు. అనంతరం స్వామికి తిరుచ్చి పల్లకీ సేవ, ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌ చెన్ను తిరుపాలరెడ్డి, సహాయ కమిషనరు కె జనార్దన్‌రెడ్డిలు ఏర్పాట్లు చేశారు.



చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నృసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

షర్మిలకు ఘన స్వాగతం

కోవూరు, జనవరి27: జిల్లా పర్యటనకు వచ్చిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్‌ షర్మిలకు స్థానిక ఇనమడుగు రోడ్డుకూడలిలో శనివారం కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్‌ జిందాబాద్‌, షర్మిల జిందాబాద్‌, సీఎం డౌన్‌ డౌన్‌.. అంటూ వారు నినాదాలు ఇచ్చారు. జాతీయ రహదారిపై కారులో వెళ్తూ ఆమె ఇనమడుగు రోడ్డు కూడలిలో కార్యకర్తలకు అభివాదం చేశారు.



అభివాదం చేస్తున్న షర్మిల

బుచ్చి విద్యార్థుల ప్రతిభ

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి27: స్థానిక గోపాలకృష్ణయ్య స్కూలు విద్యార్థులు శాట్‌-23 ఒలింపియాడ్‌ పోటీ పరీక్షల్లో స్టేట్‌ అవార్డు సాధించాలని కరస్పాండెంట్‌ ఎన్‌. శ్రీధర్‌ తెలిపారు. విద్యార్థుల తరఫున శనివారం విశాఖ పట్టణంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డును తాను అందుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



చెక్కు అందచేస్తున్న కలెక్టర్‌

- **చెక్కు అందజేత**

జన్‌ భాగీదారి వ్యాసరచన పోటీల్లో బుచ్చి మండలం చెల్లాయపాళెంకు చెందిన కోహూరు సాహిత్య ప్రతిభ కనబరిచారు. ఇందుకుగాను ఆమెకు రూ20వేల నగదు బహుమతి అందింది. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్‌ హరినారాయణన్‌ చేతుల మీదుగా ఆమె నెల్లూరులో చెక్కు అందుకున్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించండి



మనుబోలులో కరపత్రాలు అందిస్తున్న తెలుగు తమ్ముళ్లు

మనుబోలు, జనవరి 27: రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలంటూ తెలుగు తమ్ముళ్ళు మనుబోలులో శనివారం ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేణబూనబూణీ వశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తిరుపతి పార్లమెంట్‌ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, టీడీపీ నాయకులు ఇంటింటా ఆరు పథకాలకు సంబంధించి కరపత్రాలు అందించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య, రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి రాయపాటి కిరణ్‌, దండు చంద్రశేఖర్‌రెడ్డి, కలికి సుధీర్‌రెడ్డి, శివుడు రాజాగౌడ్‌, అంకయ్య గౌడ్‌, మారంరెడ్డి రమణారెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, యారాశి రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు అభివృద్ధికి అగ్ర తాంబూలం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు, జనవరి 27 : పొదలకూరు పంచాయతీలో అభివృద్ధి పనులకు అగ్ర తాంబూలం వేశామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో 3వ గ్రామ సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్‌ఆర్‌ ఆసరా 4వ విడత నగదు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరెడ్డి, తహసీల్దారు వీరవసంతకుమార్‌, ఎంపీడీవో నగేష్‌కుమారి, జడ్పీటీసీ నిర్మలమ్మ, ఎంపీటీసీ సోమ అరుణ, లక్ష్మీ కల్యాణి, సర్పంచ్‌ మల్లికా చిట్టెమ్మ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, పొదుపు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి27: మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న పుష్పయాగం ఆహ్వాన పత్రికను శనివారం కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. దాతల సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ సుబ్రహ్మణ్యంనాయుడు, సభ్యులు గుమ్మా రఘురామయ్య, బట్టేపాటి విజయమ్మ, గుంటూరు కామేశ్వరి, కాగొల్లు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

శివసాయిబాబా గ్రామోత్సవం

ముత్తుకూరు: వల్లూరు శివసాయి బాబా గ్రామోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మందిరం వ్యవస్థాపకులు వల్లూరు మోహన్‌రావు, హైమావతి దంపతులు, కుటుంబ సభ్యులు ఉదయం స్వామివారికి గణపతి పూజ నవకలశ స్నపన, విశేష హోమాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి పూర్ణాహుతి ఇచ్చారు. అనంతరం పుష్పయాగం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం ప్రథమ వార్షిక మహోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శనివారం రాత్రి వల్లూరులో శివసాయి బాబా గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నవ కలశ పూజ నిర్వహిస్తున్న వల్లూరు మోహన్‌రావు, హైమావతి


తప్పుడు కేసులకు భయపడను...

ఎవరినీ వదిలిపెట్టను !

- వవ్వేరు బ్యాంకు మాజీ చైర్మన్‌ సూరా

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి27: 'తప్పుడు కేసులకు భయపడను... అలాగే తన జోలికి వచ్చిన ఎవరినీ వదిలిపెట్టను' అని బుచ్చి వవ్వేరు బ్యాంకు మాజీ చైర్మన్‌ సూరా శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పంచేడులోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రసన్నతో కలిసి 25ఏళ్ల నడిస్తే, తనపై సారా కేసు పెట్టించి జైలుకు పంపారని ఆవేదన చెందారు. అయినా ఇంకా కేసులు ఉన్నాయని సీఐ హైమారావుతో బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తాను చట్టపరంగానే ముందుకు పోతానని చెప్పారు. కాగా ఇటీవల చిన్నాన్న కృష్ణారెడ్డితో కలిసి తాను బెంగళూరులో 100 ఎకరాలు కొన్నట్టు ఎమ్మెల్యే చెబుతున్నారని, తనకు నెల్లూరులో ఇల్లు తప్ప ఇంకేదైనా ఉంటే మీకే ఇచ్చేస్తానని చెప్పారు. పార్టీ మారే విషయమై ముందుగా విలేకరులకు తెలియచేస్తానని సూరా చెప్పారు. కార్యక్రమంలో పలువురు సూరా అనుచరులు పాల్గొన్నారు. కాగా సూరా సిఫారసుతో గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్న ఇద్దరు వలంటీర్లను రెండు రోజుల క్రితం తొలగించినట్టు సమాచారం.

ప్రజా చైతన్యం కోసమే పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న గుడి హరికుమార్‌రెడ్డి తదితరులు

ఇందుకూరుపేట, జనవరి 27 : ప్రజా చైతన్యం కోసమే పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు జన సేన కోవూరు కేర్‌టేకర్‌ గుడి హరి కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర శనివారం మండలంలోని రావూరు, కొమరిక, గంగపట్నం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామ స్థులు యాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులకు ఓటు విలువ తెలియజేస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుండాల కృష్ణారెడ్డి, జనార్దన్‌గౌడ్‌, మల్లికార్జున్‌, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కోనలో వివిధ హక్కులకు వేలం పాటలు

రాపూరు(డక్కిలి), జనవరి 27 : పెంచలకోన నృసింహస్వామి ఆలయంలో ఏడాది పొడవునా వివిధ హక్కులకు సంబంధించి శనివారం వేలం పాటలు నిర్వహించినట్లు ఆలయ కమిషనర్‌ కె జనార్దన్‌ తెలిపారు. ఈమేరకు ఆలయ ఆవరణలో టెంకాయిలు, పూజా ద్రవ్యములు అమ్ముకునేందుకు టోల్‌గేట్‌ రుసుం వసూలు చేసుకునేందుకు, భక్తులచే సమర్పించబడిన వస్త్రములను సేకరించుటకు, చెప్పులు భద్రపరుచుకొనే స్టాల్‌కు, పూలు విక్రయించుకునేందుకు, స్వామి వారికి వినియోగించిన పూలు, అగరబత్తీలు విక్రయించుకునేందుకు వేలం పాటలు నిర్వహించినట్లు ఆలయ కమిషనర్‌ కె జనార్దన్‌ తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్‌

కోవూరు, సర్వేపల్లి

మా విన్నపాలకు విలువేది..?

- గత సమావేశంలో చెప్పింది ఒక్కటీ జరగలేదు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత



ఎంపీడీవోని సత్కరిస్తున్న ఎంపీపీ, ఇతర అధికారులు

నెల్లూరురూరల్‌, జనవరి 27 : ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులుగా మాకు విలువలు లేవా..? ప్రజల సమస్యలు చెబితే ఒక్కటీ పరిష్కరించరా..? అస్సలు మేము చెప్పుకున్న వినతులు పైకి తీసుకెళ్తున్నారా..? గత సమావేశంలో చెప్పుకున్న సమస్య ఒక్కటీ పరిష్కారం కాలేదు..! ఇక ప్రజాప్రతినిధులుగా మేమున్నది ఎందుకు..? అంటూ నెల్లూరురూరల్‌ మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బూడిద విజయకుమార్‌ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉప్పుటూరు సర్పంచు వెంకటసుబ్బారెడ్డి, కందమూరు ఎంపీటీసీ గునుపాటి శ్రీనివాసులురెడ్డిలు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాలకు రావడం, భోజనం చేసిపోవడం తప్ప ఒక్క ప్రజా సమస్య కూడా పరిష్కారం కావడం లేదని వాపోయారు. మేమెందుకున్నామో మాకే అర్థం కాని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత సమావేశంలో చెప్పుకున్న ఒక్క సమస్య కూడా ఇప్పటికీ పరిష్కారం కాలేదని, మళ్లీ తాజాగా ఈ సమావేశంలో వాటినే చెప్పుకోవడం అగౌరవంగా ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సిన ఈ సమావేశానికి కొందరు మాత్రమే వస్తున్నారని, గైర్హాజరైన వారిపై ఏం చర్యలు తీసుకుంటున్నారని సూటిగా ప్రశ్నించారు. అధికార యంత్రాంగం ఏ మాత్రం సహకరించడంలేదని పెనుబర్తి ఉపసర్పంచు వెంకటేశ్వర్లురెడ్డి వాపోయారు. ఇలాగైతే ప్రజలకు తామెలా అండగా నిలవగలమని పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ విజయకుమార్‌, ఎంపీడీవో శైలేంద్రకుమార్‌లు జోక్యం చేసుకుని గైర్హాజరైన వారిపై చర్యలకు కలెక్టర్‌కు పంపుతామని, సభ్యులు చెప్పిన సమస్యల పరిష్కారానికి ఆయా శాఖలకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గణతంత్ర వేడుకల్లో అవార్డులు అందుకున్న ఎంపీడీవో శైలేంద్రకుమార్‌, ఏపీఎం సరితలను సత్కరించారు.

అలసత్వం వహిస్తే చర్యలు : కమిషనర్‌



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్‌ వికాస్‌ మర్మత్‌

నెల్లూరు(సిటీ), జనవరి 27 : విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఎన్‌ఎంసీ కమిషనర్‌ వికాస్‌మర్మత్‌ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. శనివారం నెల్లూరులోని బాలాజీనగర్‌-1, రంగనాయకులపేటలోని రామాలయం వీధి సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఎక్కడైన లోపం కనిపించినా, ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలు అనుసరించకపోయినా, రికార్డులు సరిగా లేకపోయినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా వెంటనే షోకాజు నోటీసులు జారీ చేసిన అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులంతా తమ లక్ష్యాలను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని ఆదేశించారు.

స్వర్ణాల చెరువులో 5 లక్షల చేప పిల్లలు విడుదల

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 27: రిజర్వాయర్లు, చెరువుల్లో మత్స్య సంపద పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద శనివారం నెల్లూరు స్వర్ణాల చెరువులో 5లక్షల చేప పిల్లలను వదిలారు. ప్రతి ఏడాది చేప పిల్లలను వదలడం ద్వారా చేపల లభ్యత పెరగడంతో మత్స్యకారుల జీవనోపాధికి ఉపయోగపడుతుందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. స్వర్ణాల చెరువు మీనోత్సవం పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్‌ ఆనం అరుణమ్మ, నగర మేయర్‌ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్‌ రంగారెడ్డి, నెల్లూరు ఏఎంసీ చైర్మన్‌ కోటేశ్వరరెడ్డి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, నెల్లూరు మత్స్యశాఖ ఏడీ రంగనాథబాబు, మండల కోఆప్షన్‌ సభ్యురాలు మొబినా, కార్పొరేటర్‌ విజయలక్ష్మి, వైసీపీ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, బాబీ యాదవ్‌, మధు, తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎంపీ ఆదాల

మహిళల జీవనోపాధికి పట్టణ ప్రగతి యూనిట్లు

- ఎన్‌ఎంసీ పరిధిలో 7 చోట్ల ఏర్పాటుకు సన్నాహాలు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 27 : పొదుపు మహిళల జీవనోపాధే లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రోత్సాహంతో నగరంలోని టౌన్‌ లెవల్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో నెల్లూరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ఏడు చోట్ల పట్టణ ప్రగతి యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ యూనిట్లలో కంప్యూటర్‌ ఎంబ్రైడరీ మిషన్లు, మిక్సర్‌ యూనిట్లను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం సక్సెస్‌ అయితే నగరంలోని పొదుపు మహిళలతో మరెన్ని యూనిట్లను ఏర్పాటు చేయించడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. మగ్గం వర్క్‌ జాకెట్లు, సాధారణ జాకెట్లు, మగ్గం వర్క్‌ చీరలు, సాధారణ స్టిచ్చింగ్‌కు నగరంలో మంచి ఆదరణ ఉంది. బయట మార్కెట్‌లో వాటికి మంచి ధర ఉంది. పొదుపు మహిళలు ఏర్పాటు చేస్తున్న ఈ ప్రగతి యూనిట్లలో మగ్గం వర్క్‌, ఇతర కుట్టుపనులను సరసమైన ధరలకు అందించనున్నారు. ఇందులో భాగంగా శనివారం నగరంలోని వైఎస్‌ఆర్‌ నగర్‌, అల్లీపురంలో రెండు యూనిట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, టీఈఎల్‌హెచ్‌ బీ.సుధాకర్‌, సీఎంఎం ఎస్‌కే జరినా, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, సీవోలు రీనా, సలీమా, కార్పొరేటర్‌ రామ్మోహన్‌, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్‌ను ప్రారంభిస్తున్న మెప్మా పీడీ

దోమల నివారణకు చర్యలు : మేయర్‌

నెల్లూరు(సిటీ), జనవరి 27 : దోమలను క్షేత్ర స్థాయిలో నిలువరించేందుకు పటిష్ట చర్యలు చేపట్టి, ప్రజలకు అనారోగ్య సమస్యలు దూరం చేయాలని ఎన్‌ఎంసీ మేయర్‌ పొట్లూరి స్రవంతి అధికారులను ఆదేశించారు. శనివారం 33వ డివిజన్‌ పరిధిలోని పలు ప్రాంతాలలో పారిశుధ్య అధికారులతో కలిసి డ్రైనేజీ కాలువల్లో ఆయిల్‌ బాల్స్‌ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువల్లో దోమల వ్యాప్తిని నివారించేందుకు లార్వా దశలోనే క్షీణింప చేయాలని సూచించారు. దోమలు విస్తరించకుండా తరుచూ ఫాగింగ్‌ చేయాలని తెలిపారు. ప్రజలు వ్యర్థాలను డస్ట్‌ బిన్లలో మాత్రమే వేయాలన్నారు.



కాలువలో ఆయిల్‌ బాల్స్‌ వేస్తున్న మేయర్‌ స్రవంతి

రోగులకు ఆహార ధాన్యాల పంపిణీ

నెల్లూరు(వైద్యం), జనవరి 27 : నగరంలోని డామియన్‌ ఫౌండేషన్‌ను శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్‌ పెంచలయ్య సందర్శించారు. అక్కడి టీబీ యూనిట్‌లో రోగులకు ఆహార ధాన్యాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1993 నుంచి జిల్లాలోని క్షయ, కుష్టువ్యాధి గ్రస్థులకు ఫౌండేషన్‌లో పునర్నిర్మాణ శస్త్ర చికిత్సలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్‌ ఖాదర్‌వలి, డీఎఫ్‌ఐడీ ప్రాజెక్టు మేనేజర్‌ సతీష్‌, మెడికల్‌ అధికారి డాక్టర్‌ శాంతి, డాక్టర్‌ నవీన్‌, కిశోర్‌, డాక్టర్‌ గిరిప్రసాద్‌, ఫిజియోథెరపిస్ట్‌ పీటర్‌, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌ విజయకుమార్‌, షంషద్దీన్‌, వేణుగోపాల్‌, నరసింహులు పాల్గొన్నారు.



రోగులకు ఆహార పదార్థాలు అందిస్తున్న డీఎంహెచ్‌వో

కమనీయం రంగనాథుడి కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 27 : నగరంలోని పప్పులవీధి ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తుల వద్దకు భగవంతుడు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్ర మాన్ని చైర్మన్‌ మంచికంటి శ్రీనివాసులు, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



సామూహిక కుంకుమపూజలో భక్తులు

రాజరాజేశ్వరికి సామూహిక కుంకుమపూజ

నగర శివారులోని పొట్టిపాలెం కోదండరామస్వామి ఆలయంలో శనివారం రాత్రి రాజ రాజేశ్వరి అమ్మవారికి విశేష సామూహిక కుంకుమపూజ జరిగింది. భక్తుల వద్దకు భగవంతుడు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్‌ రత్నంజయరామ్‌, సహాయ కమిషనర్‌ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, కోదండరామస్వామి ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.

జ్ఞానానికి సకల శాస్త్రాలు అవసరం లేదు

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 27 : జ్ఞానానికి సకల శాస్త్రాలు తెలిసి ఉండాలని నియమం లేదని, సమస్యల పరిష్కారంలో ధర్మమే ప్రమాణం కాని జ్ఞానం కాదని బ్రహ్మశ్రీ పాలూరి హనుమజ్జానకి రామశర్మ రచించిన త్రిపురా రహస్య జ్ఞానబండాగారం గ్రంథంలో తెలిపారని డాక్టర్‌ గిరిజాలక్ష్మి తెలిపారు. హనుమజ్జానకి రామశర్మ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 3వ సభ నగరంలోని ఆంధ్రసభ హాలులో శనివారం జరిగింది. శర్మ రచించిన బాలరామాయణం విశిష్టత గ్రంథాన్ని ఆవిష్కరించారు. మెట్టు రామచంద్రప్రసాద్‌, చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఎన్‌.బాలరామయ్యనాయుడు, శర్మగారి కుమార్తె, మనువళ్లు, గిరిజాలక్ష్మిని ఘనంగా సత్కరించారు.



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్‌ హరినారాయణన్‌ నుంచి మెడల్‌ అందుకుంటున్న నెల్లూరు చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌ ఏఎస్‌ఐ శ్రీహరి

కన్స్యూమర్‌ ప్రొటెక్షన్‌ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా పాదర్తి

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 27 : నెల్లూరు నగరానికి చెందిన పాదర్తి బాలాజీ ఆంధ్రప్రదేశ్‌ కన్స్యూమర్స్‌ ప్రొటెక్షన్‌ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, నెల్లూరు జిల్లా అధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఆయనతో పాటు జిల్లా చైర్మన్‌గా నర్రా చెంచునాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాదర్తి సాయిబాబాకు ప్రొటెక్షన్‌ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుడారి తిరిపాల్‌, కార్యదర్శి తెలికేపల్లి శేషయ్యలు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన పాదర్తి బాలాజీకి శనివారం జిల్లాలోని ఆర్యవైశ్యులు అభినందనలు తెలిపారు.



పాదర్తి బాలాజీ

ఇన్‌స్పెక్టర్‌ను పరామర్శించిన ఐజీ

నెల్లూరు(క్రైం), జనవరి 27: నాయుడుపేట - తిరుపతి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మార్టూరు ఇన్‌స్పెక్టర్‌ పీ.అక్కేశ్వరరావును శనివారం గుంటూరు రేంజ్‌ ఐజీ జీ.పాలరాజు శనివారం పరామర్శించారు. సీఐ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఐజీ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి వాసుదేవ నాయుడు

నెల్లూరు(వైద్యం), జనవరి 27 : పీసీసీ చీఫ్‌ వైఎస్‌ షర్మిల సమక్షంలో నేషలిస్ట్‌ కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జాలే వాసుదేవనాయుడు శనివారం కాంగ్రెస్‌ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు.

జనసేనలోకి భారీగా చేరికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 27: నెల్లూరు రూరల్‌ ప్రాంతంలోని శ్రామిక్‌నగర్‌కు చెందిన పలువురు శనివారం జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్‌ సమక్షంలో నగరంలోని ఆయన నివాసంలో జనసేన తీర్థపుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌, వీరమహిళ నాగరత్నం, సీనియర్‌ నాయకులు ఏటూరి రవి, కృష్ణారెడ్డి, నందిని యాదవ్‌ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో వేములపాటి అజయ్‌

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 28-1-2024

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

ఆపదలో కోడికత్తి శీను ప్రాణాలు : చింతా



తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27: "కోడి కత్తి శీను ప్రాణాలు ఆపదలో ఉన్నాయి. జైల్లోనే చంపేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు." అని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఒకప్పటి కోడి కత్తి ఘటనపై విశాఖపట్టణం విమానాశ్రయం అధికారులతో తాను మాట్లాడానంటూ, ఎన్నికలకు ముందు ప్రచారం కోసం ఒక మాజీ మంత్రి ఇచ్చిన సలహాతో కోడికత్తి రక్తపు డ్రామా ఆడారని అన్నారు. అసలు జగన్ చొక్కాకు అంటుకున్న రక్తం ఎవరిదో ఫోరెన్సిక్ పరీక్షలు చేస్తే అసలు గుట్టు బయటపడుతుందని అన్నారు. ఐదేళ్లుగా ఓ దళితుడిని జైల్లో నిర్బంధించి బెయిల్ కూడా చేస్తున్నారని, అసలు జగన్ ఎందుకు కోర్టు ముందుకు రావడంలేదు? ఇందువల్ల అనుమానాలు మరింత పెరుగుతున్నాయన్నారు.

ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో అధికార పార్టీ పరిస్థితి జిల్లాలో గందరగోళంగా మారింది. ఇన్‌చార్జిల పేరుతో చేసిన మార్పులు వైసీపీ శ్రేణులను అయోమయానికి గురి చేస్తున్నాయి. సత్యవేడును వదిలి తిరుపతి ఎంపీ స్థానం నుంచీ పోటీకి ఆదిమూలం సిద్ధంగా లేరు. అసంతృప్తిగానే గురుమూర్తి సత్యవేడుకు సిద్ధపడ్డా ఆయనకు పార్టీ శ్రేణుల సహకారం లభించే సూచనలు కనిపించడం లేదు. సూళ్లూరుపేటలో ఎంత హెచ్చరించినా వైసీపీ అసమ్మతి వర్గం సంజీవయ్యను సవాల్ చేస్తూనే వుంది. టికెట్ లేదన్నాక గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ సొంతదారులు వెతుక్కుంటున్నారు. జగన్ రెడ్డికి బుర్రలో ఏ పురుగు తొలిచిందో గానీ ఎన్నికల వేళ ఇవేం గందరగోళం మార్పులంటూ పార్టీ శ్రేణులు అయోమయంలో పడిపోయి అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాయి. జగన్ చేసిన మార్పుల్లో వేటు పడిందంతా ఎస్సీ ఎమ్మెల్యేల మీదే కావడంతో వైసీపీకి బలమైన అండగా ఉన్న ఆ వర్గంలో అసహనం పెరుగుతోంది.



- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీలో భగభగలు

ఎన్నికల వేళ ఆందోళనలో పార్టీ శ్రేణులు

సత్యవేడు ఆత్మీయభేటీకి ఆదిమూలం డుమ్మా



సత్యవేడు శ్రేణుల సమావేశంలో పెద్దిరెడ్డి,గురుమూర్తి

తిరుపతిలో శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఇటీవల సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని తిరుపతి లోక్‌సభ ఇంచార్జిగానూ, తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు సెగ్మెంట్ ఇంచార్జిగానూ అధిష్ఠానం ప్రకటించిన నేపథ్యంలో అందరినీ కూడగట్టడానికి ఈ సమావేశం నిర్వహించారు. అయితే ఏకంగా ఎమ్మెల్యే ఆదిమూలమే ఆత్మీయ సమావేశానికి డుమ్మా కొట్టారు. లోపల అసంతృప్తి ఉన్నా, సత్యవేడు నుంచి పోటీకి తిరుపతి ఎంపీ గురుమూర్తి మానసికంగా సిద్ధపడ్డారు.నియోజకవర్గంలోని ఏడు మండలాలూ పర్యటించి ముఖ్య నాయకులను కలుసుకున్నారు. అయితే ఆదిమూలం మాత్రం తిరుపతి ఎంపీగా పోటీ చేయడానికి ఏమాత్రం ఇష్టపడడం లేదని సమాచారం. తనను అసెంబ్లీ సీటు నుంచీ తప్పించడం పట్ల తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్టు చెబుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకూ నారాయణవనం, నాగలాపురం మండలాల్లో ఆదిమూలం రెండు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆదిమూలం నివాసానికి ఎంపీ గురుమూర్తి వెళ్ళగా ఇంట్లో వుండి కూడా లేదని చెప్పించారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. శనివారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో జరిగిన సమావేశానికే ఆయన హాజరు కాకపోవడం ఒక నిరసన సంకేతంగానే భావించాల్సి ఉంటుంది. అనారోగ్యం కారణంగా సమావేశానికి రాలేదని నేతలు చెబుతున్నా అది సాకు మాత్రమేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు ఆదిమూలం తన సన్నిహితులతో, గురుమూర్తికి సత్యవేడు టికెట్ రాదని చెబుతున్నట్టు సమాచారం. అంతే కాకుండా సత్యవేడు కోఆర్డినేటర్‌గా నియమితులైన ఎంపీ గురుమూర్తిని పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలవగా, అందులో కొందరిపై ఆదిమూలం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో సత్యవేడు వైసీపీలో వర్గ పోరు భగభగ రగులుతున్నట్టు అర్థం అవుతోంది.

పార్టీ, ప్లేస్ ఏదైనా పోటీ పక్కా అంటున్న వరప్రసాద్

టికెట్ గల్లంతైన నేపథ్యంలో గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రత్యామ్నాయం కోసం వేగంగా అడుగులు వేస్తున్నారు. గూడూరు నుంచీ తిరిగి అవకాశం లేదని తేలిపోయాక ఆయన తిరుపతి ఎంపీ స్థానంపై ఆశపడ్డారు. అక్కడి నుంచీ అవకాశం లేదని స్పష్టం అయ్యింది. కనీసం సూళ్ళూరు పేటపై ఆశలు పెట్టుకుందామనుకున్నా అక్కడ సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు అధిష్ఠానం టికెట్‌పై హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. వైసీపీలో దారులన్నీ మూసుకుపోవడంతో జనసేన, టీడీపీల వైపు వరప్రసాద్ చూస్తున్నారు. శుక్రవారం సూళ్ళూరుపేటలో తనకు గతంలో సన్నిహిత అనుచరులుగా వున్న ఓ సామాజికవర్గంతో ప్రత్యేకంగా సమావేశయ్యారు. అలాగే నాయుడుపేటలో పలువురు వైసీపీ నాయకుల ఇళ్ళకు వెళ్ళి కలిశారు. ముఖ్యంగా కిలివేటి సంజీవయ్యను వ్యతిరేకిస్తున్న నాయకులతో భేటీ అవుతున్నారు. తాను ఏదో ఒక పార్టీ నుంచీ టికెట్ తెచ్చుకుంటానని తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిసింది. ప్రాథమికంగా జనసేన తరపున గూడూరు, సూళ్ళూరుపేట, సత్యవేడుల్లో ఒక చోట నుంచీ గానీ లేదా తిరుపతి ఎంపీగా గానీ పోటీ చేసే అవకాశాలున్నాయని ఆయన చెబుతున్నట్టు తెలిసింది. దీంతో కిలివేటి సంజీవయ్యను వ్యతిరేకిస్తున్న నేతలు జనసేన నుంచీ కాకుండా టీడీపీ నుంచీ టికెట్ తెచ్చుకుంటే తాము పనిచేస్తామని హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

రోజాపై అవినీతి మరక

నగరిలో రోజా పరిస్థితి కూడా రోజురోజుకీ గడ్డుగా మారుతోంది. పుత్తూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి కోసం తనను మంత్రి రోజా డబ్బు అడిగారని, మంత్రి ఆదేశానుసారం ఆమె సోదరుడికి మూడు విడతలుగా రూ. 40 లక్షలు అందజేశానని 17వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భువనేశ్వరి చేసిన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. డబ్బు వెనక్కివ్వమని అడిగినందుకు మంత్రి సోదరుడి అనుచరులు వేధిస్తున్నారని కూడా వాపోయారు. దీనిపై పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి మంత్రికి మద్దతుగా భువనేశ్వరి ఆరోపణలను ఖండించినా, కాణిపాకంలో ప్రమాణానికి ఆమె ఆ వెంటనే సవాల్ విసిరారు. దానికి ఇంతవరకూ మంత్రి నుంచీ గానీ, ఆమె అనుచరవర్గం నుంచీ గానీ సమాధానం లేదు.డబ్బు తీసుకోని పక్షంలో సవాల్ స్వీకరించి ప్రమాణానికి సిద్ధమని ఎందుకు ప్రకటించడం లేదన్న ప్రశ్న అన్ని వర్గాల నుంచీ వినిపిస్తోంది. ఈ పరిస్థితి పార్టీ శ్రేణుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. అసలే గత రెండు ఎన్నికల్లోనూ బొటాబొటీ మెజారిటీతో గెలిచిన మంత్రికి ఇపుడు సొంత సెగ్మెంట్‌లో సొంత పార్టీ నేతల నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజా అవినీతి ఆరోపణలు పార్టీని కుదిపివేస్తున్నాయి.

తిరుపతి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా నీహారిక?



తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అంగలకుర్తి నీహారిక పేరు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈమె సత్యవేడు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ తలారి మనోహర్ చిన్న కోడలు కూడా. నిజానికి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేరునే పరిశీలించారని, అయితే ఆమె ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదని, తన భర్తకు అసెంబ్లీ టికెట్ కోరుతున్నారని సమాచారం. దీంతో ప్రత్యామ్నాయం గా పలు పేర్లను పరిశీలించారు. ఈ క్రమంలోనే గత తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె నీహారిక పేరు టీడీపీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది. ఆమె టీడీపీ తొలితరం రాజ్యసభ సభ్యుడు, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు. మనోహర్ పెద్ద కుమారుడు తలారి ఆదిత్య 2014-19 నడుమ సత్యవేడు ఎమ్మెల్యేగా టీడీపీ నుంచీ గెలిచిన సంగతి తెలిసిందే. విద్యాధికురాలైన యువతి కావడం, తల్లి సీనియర్ బ్యూరోక్రాట్‌గా పనిచేసివుండడం, భర్త వైపు నుంచీ మామ, బావ ఎంపీ, ఎమ్మెల్యేలుగా పనిచేసి వుండడంతో ఆమె తిరుపతి ఎంపీ స్థానానికి దీటైన అభ్యర్థి కాగలదని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలో టీడీపీకి సాంప్రదాయకంగా వున్న బలానికి తోడు పొత్తు కారణంగా జనసేన మద్దతు అదనపు బలం కానుంది. నీహారిక అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశముంది.



షర్మిలకు తిరుపతి కాంగ్రెస్ నేతల స్వాగతం

- నేడు చిత్తూరు, తిరుపతి జిల్లాల కాంగ్రెస్ శ్రేణులతో సమావేశం

తిరుపతిలో వైఎస్ షర్మిల

తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచీ మధ్యాహ్నం 12 వరకూ నగరంలోని రామతులసీ కళ్యాణ మండపంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఆ సందర్భంగా రెండు జిల్లాల్లో పార్టీ స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు పార్టీ పునర్నిర్మాణానికి సంబంధించిన దిశా నిర్దేశం చేయనున్నారు. సమావేశంలో ఆమెతో పాటు పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు, ముఖ్య నేతలు జేడీ శీలం, తాంతియా కుమారి, కొప్పుల రాజు, తులసిరెడ్డి, జంగా గౌతమ్, కొరివి వినయ్‌కుమార్, యువజన కాంగ్రెస్ నేత రామారావు, ఎన్ఎస్‌యూఐ నేత నాగ మధు తదితరులు సమావేశంలో పాల్గొననున్నారు.కాంగ్రెస్ పార్టీలో చేరి, పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా షర్మిల వస్తున్న నేపథ్యంలో తొలి సమావేశానికి వీలైనంత మంది కార్యకర్తలను రప్పించాలని నేతలు యత్నిస్తున్నారు. అందులో భాగంగా రెండు జిల్లాల పరిధిలో కార్యకర్తలను, పార్టీ అభిమానులను గుర్తించి వారికి వ్యక్తిగతంగా ఆహ్వానం పంపినట్టు సమాచారం.కాగా నెల్లూరు నుంచీ శనివారం రాత్రి తిరుపతి చేరుకున్న షర్మిలకు ఘన స్వాగతం లభించింది. నగరంలోని తాజ్ హోటల్ వద్ద ఆమెకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, రాకేష్‌రెడ్డి, పీసీపీ ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రామ్‌భూపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నేత మద్దెల అమృత్ తేజ తదితరులు స్వాగతం పలికారు.ఆదివారం మధ్యాహ్నం పార్టీ శ్రేణులతో సమావేశం ముగిశాక ఆమె అనంతపురం వెళ్ళనున్నారు.

మృతి చెందిన రమేష్



విద్యుత్ ప్రమాదంలో వైరుదొంగ మృతి



దొరవారిసత్రం, జనవరి 27: ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరును అపహరించే ప్రయత్నంలో విద్యుత్ ప్రమాదానికి గురై ఓ దొంగ మృతి చెందాడు.పోలీసుల కథనం మేరకు ...దక్కిలి మండలం మాధవయ్యపాళెం గ్రామానికి చెందిన రమేష్(31)తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి వైరు అపహరిస్తుంటాడు. ఇతనిపై పలు స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి.దొరవారిసత్రం మండలంలోని నెలబల్లి వానమ్మ గుడి ఎదురుగా జాతీయ రహదారి పక్కన గల అడవిలో వున్న ట్రాన్స్‌ఫార్మర్ కొంతకాలం క్రితం పాడైంది.దీన్ని గమనించిన రమేష్ ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరును అపహరించేందుకు శుక్రవారం రాత్రి ప్రయత్నం చేశాడు.అయితే ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.శనివారం సాయంత్రం స్థానికులు రమేష్ శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

బీజేపీ క్లస్టర్-4 ఇన్‌చార్జిగా సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 27: రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలను ఐదు క్లస్టర్లుగా విభజించి ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జిలను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి శనివారం రాత్రి జాబితా విడుదల చేశారు. ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలను క్లస్టర్-4గా విభజించి ఇన్‌చార్జిగా తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని నియమించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్‌ను క్లస్టర్-4 కో ఇన్‌చార్జిగా నియమించారు.

రేపటినుంచి విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(ఆటోనగర్), జనవరి 27 : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని తిరుపతి సర్కిల్ (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో సోమవారం నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్నట్టు ఎస్ఈ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ల పరిధిలో ఉన్న వినియోగదారులకు ఎస్ఈ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్లకు సంబంధించి రూరల్ డివిజన్ కార్యాలయంలో, పుత్తూరు డివిజన్ కార్యాలయ పరిధిలోని వినియోగదారులకు పుత్తూరులో, మదనపల్లి, పుంగనూరు డివిజన్ పరిధిలోని వినియోగదారులకు మదనపల్లెలో, పీలేరు డివిజన్ పరిధిలోని వినియోగదారులకు పీలేరు డివిజన్ కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహిస్తున్నట్టు ఎస్ఈ తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా బంగారుపాళ్యం యువకుడి ఎంపిక



ఎం.రోహిత్

బంగారుపాళ్యం, జనవరి 27: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని ముంగరమడుగు గ్రామానికి చెందిన ఎం.రోహిత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2023లో నిర్వహించిన సివిల్ జడ్జి పరీక్ష ఫలితాలను శుక్రవారం హైకోర్టు విడుదల చేయగా ఓపెన్ కేటగిరీలో ఈయన ఎంపికయ్యారు. దీంతో రోహిత్‌ను శనివారం గ్రామస్థులు అభినందించారు.


రా.. కదలిరా! సమరశంఖం పూరిద్దాం!

ఎస్వీజీఎస్ మైదానంలో రూపుదిద్దుకున్న సభా వేదిక



● నెల్లూరులో నేటి ఉదయం చంద్రబాబు సభ ● భారీ ఏర్పాట్లు చేస్తున్న జిల్లా నాయకత్వం

నెల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం సింహపురి గడ్డ నుంచి ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. నగరంలోని వేణుగోపాల స్వామి ప్రభుత్వ కళాశాల మైదానంలో ఉదయం 10 గంటలకు 'రా.. కదలి రా!' పేరిట బహిరంగ సభ జరగనుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తొలి నుంచి టీడీపీ పోరాడుతూనే ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ వేధింపులు, అక్రమ కేసులను ఎదుర్కొని దీటుగా నిలబడింది.నిరంతర పోరాటాల క్రమంలో నాలుగేళ్ల తరువాత టీడీపీ బలం పుంజుకోవడం ప్రారంభించింది. వైసీపీ అధినేత జగన్ వైఖరితో పొసగలేని ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తిరుగుబాటు ప్రకటించారు. అప్పటి నుంచి జిల్లాలో వైసీపీ బలహీనపడటం, టీడీపీ బలపడటం మొదలయ్యింది. ఈ ముగ్గురి తిరుగుబాటుతో వైసీపీ నాయకుల్లో ఆ పార్టీ అధినాయకత్వం పట్ల ఉన్న వ్యతిరేకత వ్యక్తం కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో ప్రజల్లో, ముఖ్యంగా యువతలో వైసీపీ పట్ల ఉన్న వ్యతిరేకత స్పష్టమయ్యింది. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడగలిగే శక్తి టీడీపీకి మాత్రమే ఉందనే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా ప్రజలు స్పష్టం చేశారు. అప్పటి నుంచి శరవేగంగా ఊపందుకున్న తెలుగుదేశం లోకేష్ యువగళం పాదయాత్రతో మరింత ఊపు పెంచుకుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో లోకేష్ పాదయాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహపడ్డాయి.అయితే ఊహించని విధంగా జరిగిన చంద్రబాబు అరెస్టు జిల్లా టీడీపీ శ్రేణుల ఉత్సాహంపై నీళ్లు చల్లింది. అప్పటి వరకు ఎన్నికల మూడ్‌లో ఉన్న టీడీపీ శ్రేణులు ఆత్మరక్షణ స్థితికి చేరుకున్నాయి.చంద్రబాబు విడుదలతో ఊపిరి పీల్చుకున్నారు కానీ యువగళం నాటి ఉత్సాహాన్ని తిరిగి తెచ్చుకోలేకపోయారు. పార్టీ శ్రేణులు కోల్పోయిన ధైర్యాన్ని తిరిగి నింపడానికి, రాష్ట్ర భవిష్యత్తు పట్ల ప్రజల్లో భరోసా నింపడానికి అటు కార్యకర్తలను, ఇటు ప్రజలను ఎన్నికల వైపు సమరోన్ముఖులను చేయడానికి రా...కదలిరా..! అనే నినాదంతో చంద్రబాబు పర్యటనలు మొదలు పెట్టారు. అందులోభాగంగా ఆదివారం సింహపురి గడ్డపై నుంచి చంద్రబాబు ఎన్నికల సమర శంఖం పూరించనున్నారు. ఎస్వీజీఎస్ మైదానంలో చంద్రబాబు సభ కోసం టీడీపీ జిల్లా నాయకత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి హెలికాప్టర్‌లో కనుపర్తిపాడు జడ్పీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు ఉదయం 11.30 గంటలకు చంద్రబాబు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన సభా వేదికకు వస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజలనుద్దేశించి చంద్రబాబు ప్రసంగిస్తారు. భోజన విరామం అనంతరం జిల్లా నాయకులతో మాట్లాడి కర్నూలు జిల్లా పత్తికొండకు హెలికాప్టర్‌లో వెళతారు.మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడి తదితరులు శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: నెలవల



సదస్సులో మాట్లాడుతున్న నెలవల

నాయుడుపేట టౌన్, జనవరి 27: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న శ్రీనివాస మినీ ఫంక్షన్ హాల్‌లో శనివారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి బీసీలే వెన్నముక అని చెప్పారు. బీసీల అభివృద్ధికి బీజం వేసింది స్వర్గీయ నందమూరి తారకరామారావు అని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబునాయుడు రాష్ట్రంలో బీసీలకు ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చి, వారి సంక్షేమం కోసం ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థిక భరోసా కల్పించడం జరిగిందన్నారు. వైసీపీ వివిధ కూలాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, నిధులు, అధికారాలు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సదాశివం, మాజీ జడ్పీటీసీ పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, నాయకులు వెంపల వెంకటేశ్వర్లు, సుజాతమ్మ, శ్రీనివాసులునాయుడు, విజయకుమార్ నాయుడు, అశోక్‌రెడ్డి, అవధానం సుధీర్, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, దార్ల రాజేంద్ర, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో టీడీపీ జెండా ఎగురవేస్తాం

సూళ్లూరుపేట, జనవరి 27: వచ్చే ఎన్నికల్లో సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సదాశివం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నెలవల మాట్లాడుతూ టీడీపీకి బీసీలు వెన్నుముక లాంటివారని, బీసీల అభ్యున్నతికి చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేశారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలను అణగదొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో అందరూ సైనికుల్లా పనిచేసి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేసి చంద్రబాబుకు కానుకగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, సుదర్శనరావు, బొమ్మన్ పళణి, శెల్వం, టీకే శ్రీనివాసన్, రవి, నలజాం రాము, సుధాకర్‌రెడ్డి, మాధవనాయుడు, మంజుల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం

నాయుడుపేట, జనవరి 27: నాయుడుపేట మున్సిపాలిటీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.4,49,29,693, మూలధన జమ రూ.13,71,07,000, మొత్తం ఆదాయం రూ.18,20,36,693, మూలధన ఖర్చులు రూ.13,52,65,000, కాగా ముగింపు నిల్వ రూ.4,67,71,693 అని వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రారంభ అంచనాల ప్రకారం... నిల్వ రూ.4,67,71,693, మూలధనం జమ రూ.20,86,74,000, మొత్తం ఆదాయం రూ.25,54,45,693, సాధారణ మూలధన ఖర్చులు రూ.19,52,85,000, కాగా నిల్వ రూ.6,01,60,693గా పేర్కొన్నారు. కాగా, బదిలీపై గిద్దలూరుకు వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును చైర్‌పర్సన్ దీపిక, వైస్ చైర్మన్‌లు వెంకటకృష్ణారెడ్డి, రఫీ, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు శాలువాలతో సత్కరించారు.

ROC.No.G4/149/2024 తేది : 23-01-2024

శ్రీయుత జిల్లా కలెక్టర్ తిరుపతి వారి కార్యవర్తనములు
ప్రస్తుతం : శ్రీ కె.వెంకట రమణా రెడ్డి, I.A.S

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఫారం నెం.VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువన ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములకు ప్రజా ప్రయోజనమునకై అనగా తిరుపతి జిల్లా, దక్కిలి మండలం, **మాధవాయపాలెం** గ్రామ పరిధిలో కి.మీ.307.050 నుండి 309.500 వరకు నూతనముగా నిర్మించు నడికుడి- శ్రీకాళహస్తి నూతన రైల్వే బి.జి.లైన్ నిర్మాణం కొరకు భూమి కావలయునని రైల్వేశాఖ, డిప్యూటీ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (కంస్ట్రక్షన్) వరల్డ్ క్లాసు స్టేషన్ ప్రాజెక్టు, సికింద్రాబాద్ వారు కోరినందున 2013వ సంవత్సరం, 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిభంధనలను అనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయడమైనది.

ఏ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబములు ఏమియు లేవు.

జిల్లా కలెక్టరు, తిరుపతి వారు పైన పేర్కొనిన చట్టములోని సెక్షన్ 12 క్రింద ఇవ్వబడిన అధికారములు వినియోగించి రెవిన్యూ డివిజనల్ అధికారి, గూడూరు వారికి వారి సిబ్బంది మరియు పనివారలకు ఆ భూములు భూసేకరణ పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టములోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుండి శ్రీయుత జిల్లా కలెక్టరు, తిరుపతి/ రెవిన్యూ డివిజనల్ అధికారి, గూడూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకము/ కొనుగోలు (క్రయ, విక్రయములు) లేదా ఏ విధమైనా లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టములోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా జిల్లా కలెక్టరు, తిరుపతి / రెవిన్యూ డివిజనల్ అధికారి, గూడూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : తిరుపతి మండలము : దక్కిలి గ్రామము : మాధవాయపాళెం

వరుస నంబరు	సర్వే. నెం./ సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూసేకరణ చేయవలసిన విస్తీర్ణము ఎ.సెం.	భూస్థితి	సంబంధిత ఆసామి పేరు, పట్టాదారు పేరు మరియు అనుభవదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, మరియు కట్టడములు, వివరములు
1	92-6 (సర్వే నెంబరు 92-1 నుండి విభజించబడింది)	1.64	0.74	మెట్ట	ఒరేపల్లి అంకిరెడ్డి తండ్రి రాఘవరెడ్డి	1	92-2	92-4	1	బోర్-1, డ్రిప్ సిస్టం, మామిడి-4 (చిన్నవి), సపోటా-2 (చిన్నవి), టేకు-03 (పెద్దవి), 02 (చిన్నవి), నిమ్మ-38 (పెద్దవి), 45 (చిన్నవి), వేప-05 (పెద్దవి), 03 (చిన్నవి)
2	92-4	3.39	1.33	మెట్ట	ఒరేపల్లి నిర్మలమ్మ భర్త రమణారెడ్డి	92-1	92-3	92-5	92-1	బోర్-1, డ్రిప్ సిస్టం, సిమెంట్ ఇటుకలతో గల రేకుల రూము-01, నిమ్మ-71(పెద్దవి), 26(చిన్నవి), వేప-35(పెద్దవి), 08 (చిన్నవి), టేకు -03 (పెద్దవి), 04(చిన్నవి), అరటి-22, బొప్పాయి-04
	మొత్తం		2.07							

సం/- శ్రీ కె.వెంకటరమణారెడ్డి., ఐ.ఏ.యస్, జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, తిరుపతి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిల్లకూరు, జనవరి 27: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... గూడూరుకు చెందిన దినకర్ బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దినకర్‌కు గాయాలయ్యాయి. అతనిని 108వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జనవరి 27: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసివున్న లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం పూజలు జరిగాయి. ఉదయం అభిషేకం, పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వైసీపీవి కార్మిక వ్యతిరేక విధానాలు

టీఎన్‌టీయూసీ

గూడూరు, జనవరి 27: వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్(టీఎన్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు రఘురామ్‌రాజు అన్నారు. శనివారం స్థానిక ట్యాక్సీస్టాండ్ వద్ద తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కార్మిక చైతన్య బస్సుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకువచ్చిన ఇసుక పాలసీ వల్ల నిర్మాణ రంగంలోని కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అదేవిధంగా చెన్నూరు గ్రామంలోని రామాలయం సమీపంలో బస్సు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామ్‌రాజు మాట్లాడుతూ చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి, కార్మికులకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందజేయడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను, విద్యుత్, ఆర్టీసీ చార్జీలను పెంచేయడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి కార్మికుల సంక్షేమాన్ని కాంక్షించే టీడీపీని గెలిపించుకోవాలన్నారు.



ఐక్యత చాటుతున్న టీఎన్‌టీయూసీ, టీడీపీ నాయకులు

కార్యక్రమంలో సింధూజ, చెంగళరావు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, అల్లీహుస్సేన్, పెంచలయ్య, గాయం రమణయ్య, జనార్దన రెడ్డి, పార్వతయ్య, వేముల సునీల్, మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం నిల్వపై గందరగోళం



అద్దె ఇంటిలో ఉంచిన రేషన్ బియ్యం

పెళ్లకూరు, జనవరి 27: పెళ్లకూరు మండలం దిగువచావాలి గ్రామంలోని ఓ ఇంటిలో నిల్వచేసిన రేషన్ బియ్యం ప్లాస్టిక్ సంచుల్లో ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. రాత్రిళ్లు, సివిల్ సప్లయీస్ గోదాము మూసివున్న వేళల్లో పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సమీప చౌకదుకాణాల్లో భద్రపరచడం పరిపాటేనని సివిల్ సప్లయీస్ అధికారులు చెబుతున్నారు. గతంలో విజిలెన్స్, సివిల్ సప్లయీస్ అధికారుల దాడుల్లో పట్టుబడిన బియ్యాన్ని నాయుడుపేటలోని ఓ చౌకదుకాణంలో నిల్వచేశారు. అయితే సదరు డీలరుపై సివిల్ సప్లయీస్ అధికారులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. అతని వద్ద ఉన్న బియ్యాన్ని కొంత నాయుడుపేట సివిల్ సప్లయీస్ గోదాముకు తరలించారు. మరికొంత బియ్యాన్ని సమీపంలోని దిగువచావాలి చౌకదుకాణం డీలరుకు అప్పగించారు. సదరు డీలర్ అక్కడ నుంచి సంబంధిత అధికారులకు తెలియజేయకుండానే బియ్యాన్ని అద్దె ఇంటిలో నిల్వచేశారు. గతంలో అధికారులు అందజేసిన నోటీసును కూడా ఆ ఇంటికి అంటించారు. అయితే ఆ నోటీసుపై తేదీ లేకపోవడం, పది బస్తాలు మాత్రమే పీడీఎస్ గోనె సంచుల్లో ఉండగా, మిగిలిన బియ్యం ప్లాస్టిక్ బ్యాగుల్లో ఉండడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఎస్‌ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారని సమాచారం అందడంతో దిగువ చావాలిలోని ఓ ఇంటిని పరిశీలించామని, ఆ ఇంటిని చౌకదుకాణం డీలరు విజయభాస్కర్ అద్దెకు తీసుకున్నట్లు తెలిసిందన్నారు. దీంతో సివిల్ సప్లయీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. తహసీల్దార్ రామయ్య స్పందిస్తూ గతంలో విజిలెన్స్ సివిల్ సప్లయీస్ అధికారులు పట్టుకున్న బియ్యాన్ని నాయుడుపేట సివిల్ సప్లయీస్ గోదాములో ఖాళీ లేకపోవడంతోనే దిగువచావాలి డీలరు ఆధ్వర్యంలోని ఇంటిలో భద్రపరిచినట్లు తెలిసిందన్నారు. నాయుడుపేట సీఎస్‌డీటీ ఓబయ్య స్పందిస్తూ దిగువచావాలిలో బియ్యం నిల్వవుంచిన ఇంటిని పరిశీలించామని, గతంలో సీఎస్‌డీటీగా ఉన్న అధికారి ఆ ఇంటికి నోటీసు కూడా అంటించార, అయితే దానిపై తేదీ లేదన్నారు. బియ్యం చెడిపోతాయనే ఉద్దేశంతో దిగువచావాలి డీలరు కొత్తగా వచ్చిన బియ్యం స్థానంలో పట్టుబడిన బియ్యాన్ని పంపిణీ చేశాడని, ఈ క్రమంలో ప్లాస్టిక్ సంచుల్లో బియ్యం నిల్వ ఉంచాడని తెలిపారు. అయితే ఈ విషయాన్ని సదరు డీలరు అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి ఉండాల్సిందన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై ప్రమాదం

ఐదుగురికి స్వల్పగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గూడూరు, జనవరి 27: స్థానిక త్యాగరాజవీధిలో శనివారం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య కథనం మేరకు... స్థానిక త్యాగరాజవీధిలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబం అద్దె ఇంట్లో ఉంటూ పానీపూరి వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. శనివారం వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న రామ్‌దేవ్‌పాల్, సహదేవ్‌పాల్, హనీష్, అమిత్ షాపాల్, మనీషాపాల్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి: సీఐటీయూ

నాయుడుపేట, జనవరి 27: ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద డిమాండ్ చేశారు. నాయుడుపేటలోని సుందరరామిరెడ్డి భవన్‌లో వీవోఏల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. వీవోఏలతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని, వారికి ఆండ్రాయిడ్ ఫోన్లు, డేటా ఇవ్వకుండా దాదాపు 30యాప్‌లతో పనిచేయించుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆశా జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, మధ్యాహ్న భోజన జిల్లా కార్యదర్శి విజయమ్మ, ఐద్వా నాయకురాలు చంద్రకళ, వీవోఏల సంఘ నాయకులు సుభాషిణి, వజ్రమ్మ, ప్రసూన, సునీత పాల్గొన్నారు.

రెండున్నర కిలోల బంగారు, రూ.10 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్‌ఐ కొండప్పనాయుడు

గూడూరు, జనవరి 27: గూడూరు రైల్వేస్టేషన్‌లో ఇద్దరు ప్రయాణికుల నుంచి రెండున్నర కిలోల బంగారు, రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ కొండప్పనాయుడు శనివారం తెలిపారు. జీఆర్పీ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన లోకనాథం, సాయికుమార్ బ్యాగులను తనిఖీ చేయగా రూ.1.50 కోట్లు విలువచేసే రెండున్నర కిలోల బంగారం, రూ 10.40 లక్షల నగదు గుర్తించారు. సరైన ధృవీకరణ పత్రాలను చూపించకపోవడంతో బంగారం, నగదును సీజ్ చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జయప్రకాష్, వెంకటసుబ్బయ్య, గణేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, జనవరి 27: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీహాలులో శనివారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో బొమిడి శ్రీనివాసులు దాతృత్వంతో దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, రాఘవరెడ్డి, పీఎంరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించండి

నాయుడుపేట, జనవరి 27: మున్సిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూమిని ఇతరులకు అన్యాక్రాంతం చేయవద్దని 25వ వార్డు కౌన్సిలర్ పసల చినపెంచలయ్య కోరారు. నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో చైర్ పర్సన్ కటకం దీపికకు వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబరు 296లో 11 సెంట్లు, సర్వే నెంబరు 296/1ఎ1లో 0.05 సెంట్ల స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు.

అవసరమైన పనులనే గుర్తించండి

కోట, జనవరి 27: ఉపాధి పథకం కింద ప్రజలకు అవసరమైన పనులనే గ్రామాల్లో గుర్తించాలని డ్వామా ఏపీడీ వరప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో రికార్డులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలు, వాటి పురోగతిని ఏపీవో పూర్ణిమను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 21 పంచాయతీల్లో 781పనులను గుర్తించడం జరిగిందని, పలు కాలువలపై మొక్కలు నాటేందుకు గ్రామసభల ఆమోదం పొందినట్లు తెలిపారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, శాంతి, పరుశురామ్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నాయుడుపేట, జనవరి 27: మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంఈవో మునిరత్నం అన్నారు. స్థానిక నారాయణ పాఠశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. విద్యార్థులకు రన్నింగ్ రేస్, కబడ్డీ, ఖోఖో, టగ్‌ఆఫ్‌వార్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు అందజేశారు. క్లస్టర్ ప్రిన్సిపాల్ షేక్ రియాజ్, ఏజీఎం గురవయ్య, ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఏవో గౌస్‌బాషా, డీన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జనసేన నేతల సంబరాలు

వెంకటగిరి, జనవరి 27: సినీ నటుడు చిరంజీవికి పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించడంతో శనివారం జనసేన నేతలు, చిరంజీవి అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ సేవాసంఘం కార్యాలయంలో రాష్ట్ర రాయల్ కాప్స్ గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య కేక్ కట్ చేశారు.

గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నాం

నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 27: వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ నాయకులంతా గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నామని నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో విజయసాయిరెడ్డి నియోజకవర్గ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రతి వైసీపీ నాయకుడు, కార్యకర్త తనకు కావాలన్నారు. వైసీపీ సీనియర్ నాయకుడు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి పార్టీకి ఎంతో అవసరమన్నారు. 29న 1008 టిట్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. రాజా కుటుంబీకుడు సర్వజ్ఞ యాచేంద్ర మాట్లాడుతూ సైదాపురంలో అక్రమ మైనింగ్ జరగడం లేదన్నారు. మైనింగ్ తీయాలంటే 19 శాఖల అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, కనుక ఇక్కడ ఎవరూ అక్రమంగా చేయలేరని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైసీపీ పట్టణ కన్వీనర్ డిల్లీబాబు, వహీదా, ఉమామహేశ్వరి, బాలయ్య, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలను కలిసిన రాజ్యలక్ష్మి

డక్కిలి, జనవరి 27: మండలంలోని పాతనాలపాడు, కేబీపల్లి, మోపూరు, పలుగోడు గ్రామాల్లోని వైసీపీ నేతలను శనివారం మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కలిశారు. పాతనాలపాడులో అరుణాచలం, సుబ్బానాయుడు, కేబీపల్లిలో మాజీ సర్పంచు రమణయ్య, పలుగోడులో మాజీ ఎమ్మెల్యే పాదిలేటి వెంకటస్వామి రెడ్డి కటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. ఏ కష్టం వచ్చినా తాను అండుబాటులో వుంటానని, తన కుమారుడు రాంకుమార్ రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మోపూరులోనూ వైసీపీ నేతల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట వైసీపీ నాయకులు బండి రమేష్ రెడ్డి, శ్రీహరికోట కృష్ణయ్య తదితరులు వున్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

గూడూరు, జనవరి 27: స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో చావా వాసుదేవ రావు, గాలి ప్రకాశ్‌నాయుడు, సురేశ్, శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని కొత్తూరు, చింతపూడి, రావులపాడు, పుల్లూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్న లక్ష్యంతో ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి, ప్రధాన కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నాయకులు కొప్పోలు సుబ్రహ్మణ్యం, రవి తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణ దేవరాయల జయంతి

సూళ్లూరుపేట, జనవరి 27: సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజి వీధిలో శనివారం రాయలసీమ బలిజ మహాసభ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయల జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయలసీమ బలిజ మహాసభ రాష్ట్ర మహిళా కార్యదర్శి నాదెండ్ల శాంతకుమారి, సుంకర ప్రతిమ, పుసుపులేటి ఉష, కాసారం సుబ్బయ్య, బాలకృష్ణ, బాలాజి, సుబ్బారావు, ఎలమందయ్య, బీజేపీ నాయకులు తన్నీరు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సాధికార యాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు

గూడూరు, జనవరి 27: కోట పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని మంగళపూరు గ్రామంలో వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటలో మధ్యాహ్నం 4గంటలకు బస్సుయాత్ర నిర్వహిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎద్దల నరేంద్ర రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాబురెడ్డి, నాగరాజు, రాజారెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ ఆక్రమణకు యత్నం



ఆక్రమణకు గురైన పంటకాలువ

కోట, జనవరి 27: పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీ మీదుగా వెళ్లే పంటకాలువను స్థానికంగా ఉన్న కొంతమంది ఆక్రమించి పూరిగుడిసెలు వేసే ప్రయత్నం చేయడంతో శనివారం నీటిపారుదలశాఖ అధికారులు అడ్డుకొన్నారు. తిన్నెలపూడి సమీపంలోని స్వర్ణముఖినది నుంచి పంట కాలువ క్రాస్‌రోడ్డు, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ మీదుగా వంజివాక చెరువులోకి వెళ్తుంది. అధికార పార్టీ నాయకుల అండతో స్థానికులు కొందరు పంట కాలువను ఆక్రమించి పూరి గుడిసెలు వేసేందుకు సన్నద్ధమయ్యారు. సమాచారం తెలుసుకున్న నీటిపారుదలశాఖ ఏఈ మునిరత్నం, వర్క్‌ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పనులను అడ్డుకొన్నారు.

తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోండి

కోట, జనవరి 27: రైతులు సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. కోట మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం, కోట రైతు భరోసా కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా కొక్కుపాడు, వెంకన్నపాళెం గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఆయన వెంట సహాయ వ్యవసాయ అధికారులు ఉన్నారు.

చెంగాళమ్మ సేవలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు

సూళ్లూరుపేట, జనవరి 27: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని శనివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి దంపతులు దర్శించుకొన్నారు. వారికి ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో వేలం పాటలు

సూళ్లూరుపేట, జనవరి 27: చెంగాళమ్మ ఆలయంలో వివిధ వస్తు సామగ్రివిక్రయానికి శనివారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. పూలు, వస్త్రాలు, పూజా సామగ్రి తదితర వస్తువులు అమ్ముకోవడానికి వేలం పాటలు నిర్వహించగా రూ.1,28,76,000 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రూ.26 లక్షలు అధికంగా చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, పాలక మండలి సభ్యుడు వంకా దినేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల ఐక్యవేదిక అభ్యర్థిగా తేజావతి

వెంకటగిరి, జనవరి 27: జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా జంజం తేజావతిని ఆ పార్టీ ప్రకటించింది. తొలి జాబితాలో తన పేరును ప్రకటించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షుడు నీలురుషింగప్ప, నాయకులు శీలం వెంకటేశ్వర్లుకు తేజావతి కృతజ్ఞతలు చేశారు.